


ఆర్‌ఎన్‌ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 53 తిరుపతి తేది : ఆదివారం 24 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS



## చైనా బొగ్గు గనిలో భారీ పేలుడు

**- 90 మంది మృతి - ప్రమాద సమయంలో గని లోపల మొత్తం 247 మంది కార్మికులు**


బీజింగ్ -ఆంధ్రనాడు, మే 23

చైనాలోని ఓ బొగ్గు గనిలో సంభవించిన భారీ పేలుడులో సుమారు 90 మంది కార్మికులు తమ ప్రాణాలను కోల్పోయారు. పలువురు ఇంకా భూగర్భంలో చిక్కుకుపోయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఇటీవల కాలంలో చైనాలో జరిగిన అతిపెద్ద పారిశ్రామిక ప్రమాదాల్లో ఇదొకటిగా

- మిగతా 2లో..

## 'అమెరికా ఫస్ట్' వీసా టూల్.. యూఎస్-ఇండియా సంబంధాలే లక్ష్యం

- 'అమెరికా ఫస్ట్' పేరుతో కొత్త వీసా షెడ్యూలింగ్ టూల్‌ను ప్రారంభించిన యూఎస్
- భారత పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటన
- వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారుల వీసాలకు తొలి ప్రాధాన్యం
- వీసా ప్రక్రియలో జాప్యాన్ని నివారించి సంబంధాలు బలోపేతం చేయడమే లక్ష్యం
- అమెరికాలో భారత కంపెనీల పెట్టుబడులు 20 బిలియన్ డాలర్లకు పైమాటే



న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, మే 23

భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టం చేసే దిశగా యూఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. 'అమెరికా ఫస్ట్' పేరుతో సరికొత్త వీసా షెడ్యూలింగ్ టూల్‌ను ప్రవేశపెడుతున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు. భారత్‌లో నాలుగు రోజుల పర్యటనలో ఉన్న ఆయన, ఢిల్లీలో యూఎస్ ఎంబసీ సపోర్ట్ అనెక్స్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ నూతన

- మిగతా 2లో..

## ఆహారమే ఔషధం.. వంటగది ఒక ఔషధశాల

- చిత్తూరు జిల్లా కండ్రిగలో సంజీవని కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ఆరోగ్య పథకం ప్రారంభం
- రాష్ట్రంలో వైద్యరంగానికి రూ. 19,305 కోట్లు కేటాయించామని వెల్లడి
- నీటి సంరక్షణతో అన్నమయ్య జిల్లాలో భూగర్భ జలాలు, పచ్చదనం పెరిగాయని వివరణ
- సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి క్యాలెండర్ విడుదల చేశామని స్పష్టం

చిత్తూరు - ఆంధ్రనాడు, మే 23

"ఆహారమే ఔషధం, వంటశాలే ఔషధ శాల. ఈ మాట నేను ఎప్పుడూ చెబుతాను. మనం తినే ఆహారమే మనకు తిరుగులేని ఆరోగ్యాన్ని అందిస్తుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. తన వరకు తాను పూర్తి ఆహార నియమాలు పాటిస్తానని, మంచి అలవాట్లు, మంచి ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచనల ద్వారా




ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి జీవన శైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంపద ఉన్నవాళ్లకంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లే అదృష్టవంతులని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా 'సంజీవని' కార్యక్రమం ప్రాముఖ్యతను సీఎం

- మిగతా 2లో..



## ఏఐ సాయంతో వైద్యం..

- 'సంజీవని' సేవలను ప్రత్యక్షంగా వీక్షించిన చంద్రబాబు
- చిత్తూరు జిల్లా యాదమరిలోని 'సంజీవని' పీహెచ్‌సీని సందర్శించిన సీఎం చంద్రబాబు
- రోగి నమోదు నుంచి మందుల పంపిణీ వరకు డిజిటల్ ప్రక్రియను పరిశీలన
- ఏఐ ఆధారిత వైద్యం, వర్చువల్ కన్సల్టేషన్ విధానాలను ప్రత్యక్షంగా వీక్షించిన సీఎం
- సాంకేతికతతో వైద్యులకు డాక్యుమెంటేషన్ భారం తగ్గి రోగులపై శ్రద్ధ పెరిగిందని వెల్లడి
- కుప్పం, బెంగళూరు నిపుణులతో వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహణ

చిత్తూరు - ఆంధ్రనాడు, మే 23

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అత్యాధునిక సాంకేతికతతో వైద్య సేవలు అందించే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం చిత్తూరు జిల్లాలో పర్యటించారు. యాదమరి మండలంలోని 'సంజీవని' ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆయన సందర్శించి, అక్కడ అందుతున్న డిజిటల్ వైద్య సేవల పనితీరును స్వయంగా సమీక్షించారు. టెక్నాలజీని అనుసంధానించి సామాన్యులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారనే అంశాన్ని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా, ఒక రోగి పీహెచ్‌సీకి వచ్చినప్పటి నుంచి వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకుని వెళ్లేంత వరకు జరిగే పూర్తి ప్రక్రియను సీఎం చంద్రబాబు ప్రత్యక్షంగా వీక్షించారు. ముందుగా, పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ (పీసీసీ) డెస్క్ వద్ద డిజిటల్ పద్ధతిలో రోగి వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్, విజిట్ రికార్డుల జనరేషన్, రోగుల సేవల మ్యాపింగ్ వంటి అంశాలను అక్కడి సిబ్బంది సీఎంకు వివరించారు. అనంతరం పీహెచ్‌సీ డ్యాష్‌బోర్డును పరిశీలించి, రోజువారీగా నమోదవుతున్న మొత్తం రిజిస్ట్రేషన్లు, కన్సల్టేషన్ల వివరాలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ట్రాక్ చేస్తున్న విధానంపై అధికారులతో చర్చించారు. ఆ తర్వాత స్టాఫ్ నర్స్ స్టేషన్‌కు వెళ్లి, రోగుల బీపీ, ఎత్తు, బరువు, శరీర ఉష్ణోగ్రత, హార్ట్ బీట్, పల్స్ రేట్ వంటి కీలక వివరాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఇక్కడి నుంచి అత్యంత కీలకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అసిస్టెడ్ కన్సల్టేషన్ విధానాన్ని వీక్షించారు. మెడికల్ ఆఫీసర్ ఒక రోగి పాత ఆరోగ్య చరిత్రను సేకరించడం, నర్సులు నమోదు చేసిన వివరాలను తనిఖీ చేయడం, ఏఐ సపోర్ట్‌తో వ్యాధి నిర్ధారణకు సహకారం తీసుకోవడం వంటివి లైవ్‌లో ప్రదర్శించారు. ఈ టెక్నాలజీ వల్ల డాక్యుమెంటేషన్ భారం గణనీయంగా తగ్గి,

- మిగతా 2లో..



## విప్ పదవికి అరవ శ్రీధర్ రాజీనామా

**- పవన్‌తో భేటీ అనంతరం లేఖ విడుదల**
**- పద్ధతి మార్చుకుంటానన్న పోలవరం ఎమ్మెల్యే బాలరాజు**

అమరావతి - ఆంధ్రనాడు, మే 23

రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రభుత్వ విప్ పదవికి రాజీనామా చేశారు. శ్రీధర్‌తో పాటు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆ పార్టీ పిఏసి సభ్యులు నాదెండ్ల మనోహర్‌తో కలిసి శనివారం విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం తన విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు శ్రీధర్ లేఖ విడుదల చేశారు. తనను పెళ్లి చేసుకుంటానని శ్రీధర్ మోసం చేశారని హర్షవీణ అనే మహిళ కేసు పెట్టిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై విచారణ

- మిగతా 2లో..

## మహానాడు పండుగలా జరపాలి..

- అందరం కలిసికట్టుగా పనిచేయాలి: మంత్రి నారా లోకేశ్
- ఈ నెల 27, 28 తేదీల్లో టీడీపీ మహానాడు
- క్లస్టర్ల స్థాయిలో వర్చువల్‌గా హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహణ
- 'స్త్రీ శక్తి మహానాడు' థీమ్‌తో కార్యక్రమాలు
- పార్టీ శ్రేణులను ఏకం చేసి, స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని లోకేశ్ పిలుపు
- మహానాడు విజయవంతానికి ఐక్యంగా పనిచేయాలని దిశానిర్దేశం

అమరావతి- ఆంధ్రనాడు, మే 23

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడును ఈసారి క్లస్టర్ల స్థాయిలో ఒక పండుగ వాతావరణంలో, కలిసికట్టుగా విజయవంతం చేయాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. హైబ్రిడ్ విధానంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న మహానాడు సన్నాహకాలపై



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,875 క్లస్టర్ ఇంఛార్జ్‌లతో ఆయన ఆన్‌లైన్ ద్వారా సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈసారి మహానాడును 'స్త్రీ శక్తి మహానాడు' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

### హైబ్రిడ్ విధానంలో నిర్వహణ

వాస్తవానికి ఈసారి మహానాడును నెల్లూరులో అత్యంత ఘనంగా మూడు రోజుల పాటు నిరంహించాలని పార్టీ భావించింది. అయితే,

- మిగతా 2లో..

# ‘అమెరికా ఫస్ట్’ వీసా టూల్..
# యూఎస్-ఇండియా సంబంధాలే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

విధానం ద్వారా ఇరు దేశాల మధ్య ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసే వ్యాపార నిపుణులకు వీసా ప్రక్రియలో ప్రాధాన్యత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. “కొన్నిసార్లు వీసా ప్రక్రియలో జాప్యం లేదా అనిశ్చితి వ్యాపార పర్యటనలు, పెట్టుబడుల సమావేశాలు, భాగస్వామ్య ఒప్పందాల వంటి కీలకమైన కార్యకలాపాలకు ఆటంకంగా మారుతోంది. ఈ ఇబ్బందిని తొలగించేందుకే ఈ స్మార్ట్ షెడ్యూలింగ్ వ్యవస్థను తీసుకొస్తున్నాం” అని రూబియో వివరించారు. అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసే దరఖాస్తుదారులకు వీసా షెడ్యూలింగ్‌లో త్వరగా అవకాశం కల్పించడమే ఈ టూల్ ప్రాథమిక సూత్రమని తెలిపారు. ముఖ్యంగా ఒప్పందాలు కుదుర్చుకోవడానికి, కార్యకలాపాలను విస్తరించడానికి, అమెరికా మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే భారత కంపెనీల ప్రతినిధులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

భారత్–అమెరికా సంబంధాలు వార్తా శీర్షికల్లో కనిపించని రీతిలో ఎన్నో విధాలుగా బలపడుతున్నాయని రూబియో అన్నారు. “భారత కంపెనీల నుంచి అమెరికాలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి” అని ఆయన గుర్తుచేశారు. ఇరు దేశాల వాణిజ్య సంబంధాలు గణనీయంగా విస్తరించాయని, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సైనిక విన్యాసాల ద్వారా భద్రతా భాగస్వామ్యం కూడా బలపడిందని తెలిపారు. క్రమబద్ధమైన, సురక్షితమైన కాన్సులర్ వ్యవస్థ ఈ ముఖ్యమైన బంధాన్ని మరింత దృఢంగా మారుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కొత్త సదుపాయం, వ్యవస్థ కేవలం వీసా దరఖాస్తుదారుల కోసమే కాదని రూబియో స్పష్టం చేశారు. అమెరికా జాతీయ ప్రయోజనాల కోసం ప్రతిరోజూ ముందు వరుసలో నిలబడి పనిచేస్తున్న కాన్సులర్ అధికారులు, సహాయక సిబ్బంది, ఇతర ఉద్యోగుల పనితీరును మెరుగుపరచడానికి కూడా ఇది దోహదపడుతుందన్నారు. “ఈ సదుపాయం మా పనిని మరింత కచ్చితంగా, వేగంగా, సమర్థవంతంగా చేయడానికి వీలు కల్పిస్తుంది. తద్వారా అమెరికన్ల డబ్బు ఆదా అవుతుంది” అని ఆయన పేర్కొన్నారు.

# ఏఐ సాయంతో వైద్యం..

(మొదటిపేజీ తరువాయి)



రోగులపై ఎక్కువ సమయం కేటాయించేందుకు వీలవుతుందని వైద్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆటోమేటెడ్ డాక్యుమెంటేషన్, డిజిటల్ ప్రిస్క్రిప్షన్ జనరేషన్ ప్రక్రియలను కూడా సీఎంకు చూపించారు. అనంతరం ఫార్మసీ విభాగాన్ని సందర్శించిన చంద్రబాబు, డిజిటల్ ప్రిస్క్రిప్షన్ ఆధారంగా రోగులకు వేగంగా మందులు పంపిణీ చేస్తున్న విధానాన్ని చూశారు. చివరిగా, పీహెచ్‌సీలోని వర్చువల్ రూమ్ నుంచి ‘సంజీవని’ ప్లాట్‌ఫామ్ ద్వారా కుప్పం ఏరియా ఆసుపత్రి, బెంగళూరులోని టాటాఎండీకి చెందిన నిపుణులైన వైద్యులతో వర్చువల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వైద్య అంతరాలను తగ్గించడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందని సీఎం అభిప్రాయపడ్డారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది పనితీరును అభినందించారు.

# మహానాడు పండుగలా జరపాలి..

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునకు స్పందించి, ఈసారి హైబ్రిడ్ విధానంలో మహానాడును రెండ్రోజులు నిర్వహించాలని నిర్ణయించినట్లు లోకేశ్ వివరించారు. దీని ప్రకారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే ప్రధాన కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ కేంద్రాల్లో వర్చువల్‌గా మహానాడు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి క్లస్టర్ కేంద్రంలో ఎల్‌ఈడీ టీవీ, స్పీకర్లు వంటి సాంకేతిక ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

**క్లస్టర్ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం**

ఈ మహానాడును క్లస్టర్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ఒక మంచి అవకాశంగా ఉపయోగించుకోవాలని లోకేశ్ అన్నారు. “క్లస్టర్ ఇంఛార్జ్‌లకు ఎక్కువ బాధ్యత ఇవ్వాలన్నది పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశం. ఈ వ్యవస్థ ద్వారానే మనం ముందుకు వెళ్లాలి” అని ఆయన పేర్కొన్నారు. క్లస్టర్ పరిధిలోని కుటుంబ సాధికార సారథి (కేఎస్ఎస్) నుంచి బూత్ ఇంఛార్జ్‌లు, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల సభ్యుల వరకు అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. హాజరును ‘మై టీడీపీ’ యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు తెలిపారు.

**స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి**

ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో, త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని లోకేశ్ గుర్తుచేశారు. ఇందుకు మహానాడును ఒక వేదికగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీలో వ్యక్తులు శాశ్వతం కాదని, వ్యవస్థే శాశ్వతమని, ఆ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకే క్లస్టర్ ఇంఛార్జ్‌లకు అవకాశం కల్పించామని అన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి పనితీరును ‘మై టీడీపీ’ యాప్ ద్వారా గుర్తిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లతో సమన్వయం చేసుకుంటూ, ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి మహానాడును చారిత్రాత్మక విజయంగా నిలపాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు, జోనల్ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## చైనా బొగ్గు గనిలో
# భారీ పేలుడు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ మీడియా పేర్కొంది. షాన్సీ ప్రావిన్స్‌లోని టోంగౌజ్ గ్రూప్‌కు చెందిన లియుషెన్యు బొగ్గు గనిలో శుక్రవారం(మే 22వ తేదీ) రాత్రి 7:29 గంటలకు ఈ పేలుడు సంభవించినట్లు ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. ప్రమాదం జరిగిన సమయంలో మొత్తం 247 మంది కార్మికులు భూగర్భంలో పనిచేస్తున్నట్టు సమాచారం. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ బృందాలు, అక్కడ చిక్కుకున్న చాలా మందిని శనివారం ఉదయం నాటికి సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. అయినప్పటికీ 82 మంది మృతిచెందినట్లు అధికారులు ధ్రు వీకరించారు.

**గల్లంతైన వారి కోసం గాలింపు**

ఇదిలా ఉండగా మరో తొమ్మిది మంది కార్మికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయని అన్నారు. సంఘటనా స్థలంలో భారీ సంఖ్యలో అంబులెన్స్‌లు, రెస్క్యూ సిబ్బంది మోహరించాయి. ప్రభుత్వ ప్రసార సంస్థ, సీసీటీవీ విడుదల చేసిన వీడియోల్లో హెల్మెట్లు ధరించిన సహాయక సిబ్బంది స్ట్రెచర్‌లపై గాయపడిన వారిని తరలిస్తున్న దృశ్యాలు కనిపించాయి. గాయపడిన వారికి అత్యవసర వైద్యసేవలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

**అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆదేశాలు**

ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్పందించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. “అన్ని ప్రాంతాలు, విభాగాలు ఈ ప్రమాదం నుంచి గుణపాఠం నేర్చుకోవాలి.

పని ప్రదేశ భద్రత విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి భారీ ప్రమాదాలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి” అని పేర్కొన్నారు.

**కార్బన్ మోనాక్సైడ్ లీక్**

ప్రాథమిక దర్యాప్తులో గనిలో కార్బన్ మోనాక్సైడ్ వాయువు స్థాయిలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నట్లు గుర్తించినట్లు ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ వాయువు అత్యంత విషపూరితమైనది అలాగే ఎటువంటి వాసన లేనిదిగా పరిగణిస్తారు. పేలుడుకు కారణమైన కంపెనీకి బాధ్యత వహిస్తున్న ఓ వ్యక్తిని అధికారులు అదుపులోకి తీసుకున్నట్టు స్థానిక మీడియా తెలిపింది.

## ఆహారమే ఔషధం..
# వంటగది ఒక ఔషధశాల

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. “రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో, డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమానికి ‘సంజీవని’ అని పేరు పెట్టాం. సంపద కంటే ఆరోగ్యమే గొప్పది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారు” అని చంద్రబాబు పేర్కొన్నారు. వ్యాధులు రాకముందే గుర్తించి, నివారించేందుకు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు.

గత జూలైలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ పథకంలో భాగంగా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజల ఇళ్ల వద్దే నిర్వహించి, రిపోర్టులు అందిస్తామన్నారు. డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, వ్యక్తిగత ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా కూడా వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఒక ఏఐ డాక్టర్ ఉంటాడని స్పష్టం చేశారు.

వైద్య ఖర్చుల భారం నుంచి కుటుంబాలను గట్టెక్కించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది వైద్యరంగానికి రూ.19,305 కోట్లు కేటాయించామని, 15వ ఆర్థిక సంఘం నుంచి దేశంలోనే అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు సాధించామని గుర్తుచేశారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల విలువైన వైద్యం, ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల వరకు ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటామని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీఎం అన్నారు. సమర్థ నీటి నిర్వహణతో భూగర్భ జలాలను పెంచగలిగామని, దీనికి అన్నమయ్య జిల్లానే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం చర్యలతో అక్కడ భూగర్భ జలాలు 8.5 మీటర్లు పెరిగి, పచ్చదనం పెరిగిందన్నారు. రాష్ట్రమంతా తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే, అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయని, పిడుగురాళ్లలో 49 డిగ్రీలు నమోదైతే, అన్నమయ్యలో 40 డిగ్రీలే ఉందని నివేదికలను ఉటంకించారు. సాగునీటి ప్రాజెక్టులపై సంకల్పంతో పనిచేస్తున్నామని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తామో క్యాలెండర్ విడుదల చేశామని చంద్రబాబు తెలిపారు. నీవా పనులు పూర్తిచేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తెస్తామని, కల్యాణి డ్యాంకు కూడా నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. గాలేరు–నగరి, మల్లెమడుగు, సోమశిల–స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ప్రాజెక్టుల పూర్తికి గడువులను ప్రకటించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే తమ లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు.

## విప్ పదవికి
# అరవ శ్రీధర్ రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

చేసేందుకు జనసేన ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. పవన్‌కల్యాణ్, శ్రీధర్ సమావేశంలో ఆయనపై వచ్చిన ఆరోపణలు, నెలకొన్న వివాదాలపై వివరణ ఇచ్చినట్లు జనసేన పార్టీ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. సమావేశం అనంతరం తన వ్యక్తిగత కారణాలతో విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు శ్రీధర్ లేఖ విడుదల చేశారు. పోలవరం ఎమ్మెల్యే బాలరాజుతో కూడా పవన్ భేటీ అయ్యారు. బాలరాజుపై కూడా ఆర్థిక ఆరోపణలు, కుటుంబానికి సంబంధించిన ఫిర్యాదులొచ్చాయి. వ్యక్తిగత వ్యవహారాలను చక్కదిద్దుకొనేందుకు నాలుగు వారాల గడువు ఇవ్వాలని పవన్‌ను బాలరాజు కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పంచాయతీల్లో అభివృద్ధి పనులకు కేటాయించిన రూ.147 కోట్ల పనుల అంశంపై చర్చకు వచ్చింది. సకాలంలో ఈ పనులను ఎందుకు పూర్తి చేయలేదని బాలరాజును పవన్ ప్రశ్నించారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తానని సమావేశం అనంతరం బాలరాజు లేఖ విడుదల చేశారు.

# జగన్‌వి రాజకీయ డ్రామాలు
### - టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

**అమరావతి– ఆంధ్రనాడు, మే 23**



వైసిపి అధినేత వైఎస్ జగన్ మూడు నెలలకోసారి ప్రెస్‌మీట్లు పెట్టి రాజకీయ డ్రామాలకు తెరలేపుతున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో వస్తున్న సానుకూల స్పందనను మళ్లించేందుకే ఇలా చేస్తున్నారన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అబద్ధాలే ఆయుధంగా, అరాచకాలే రాజకీయంగా ముందుకు సాగిన వ్యక్తి వైఎస్ జగన్ ఆరోపించారు. గత మూడు నెలల్లో రాష్ట్రానికి క్యారియర్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి ప్రతిష్టాత్మక పెట్టుబడులొచ్చాయని, జాబ్ క్యాలెండర్, విశ్వవిద్యాలయాల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని గుర్తుచేశారు. తన ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒక్క శాశ్వత అభివృద్ధి పని చేయని జగన్, ఇప్పుడు తానే రాష్ట్రాన్ని ఉద్ధరించానని చెప్పుకోవడం హాస్యాస్పదమని పేర్కొన్నారు.

# వడదెబ్బకు ఆరుగురు మృతి


**అమరావతి– ఆంధ్రనాడు, మే 23**

తీవ్రమైన ఎండలు, వడగాల్పులతో శనివారం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఒక్కరోజే 21 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ముగ్గురు, విజయవాడ లో ముగ్గురు శనివారం మరణించారు. అంబే ద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం పోస్ట్ ఆఫీస్ వీధికి చెందిన ఎన్ సి ఆనంద్ (92) ఎండ వేడిమికి తాళలేక మరణించారు. కాకినాడ జిల్లా సామర్లకోట ?పట్టణం బ్రౌన్ పేటకు చెందిన లోడ సత్తులు (50) ఎండ వేడిమికి తాళలేక శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. శనివారం తెల్లవారుజామున మరణించారు. కాకినాడ జిల్లా గండేపల్లికి చెందిన షేక్ దుర్గా సాహెబ్(51) ఎలక్ట్రికల్ పనిచేస్తున్న సమయంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి ఇంటిలోనే మరణించారు. విజయవాడ బస్టాండ్‌లోని 41, 44 (అమరావతి, జగ్గయ్యపేట, ఖమ్మం) ప్లాట్ ఫారమ్‌పై ముగ్గురు వ్యక్తులు మరణించారు. వీరిలో ఒకరు ఖమ్మం జిల్లా వైరాకు చెందిన రవి (60)గా పోలీసులు గుర్తించారు. మిగతా ఇద్దరి వివరాలు సేకరిస్తున్నారు. ముగ్గురు మృతదేహాలను కృష్ణలంక స్వర్గపురి మార్చురీకి తరలించారు. వడదెబ్బకు గురై వీరు ముగ్గురూ మరణించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

# వైట్ హౌస్ సమీపంలో కాల్పుల కలకలం

**వాషింగ్టన్ – ఆంధ్రనాడు, మే 23**

వాషింగ్టన్‌లోని అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసమైన వైట్ హౌస్ సమీపంలో శనివారం రాత్రి కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. సీక్రెట్ సర్వీస్ విభాగం తెలిపిన వివరాల ప్రకారం... ఓ దుండగుడు వైట్ హౌస్ పరిసరాల్లోని 17ష్ట్ర స్ట్రీట్, పెన్సిల్వేనియా అవెన్యూ వద్ద ఉన్న సీక్రెట్ సర్వీస్ చెక్‌పాయింట్ దగ్గరకు చేరుకుని, ఒక్కసారిగా తన వద్ద ఉన్న ఆయుధాన్ని తీసి అక్కడి రక్షణ అధికారులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఊహించని దాడితో అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ భద్రతా సిబ్బంది వెంటనే ఎదురుకాల్పులు జరపడంతో, సదరు దుండగుడు అక్కడికక్కడే మరణించాడు. అయితే, ఈ పరస్పర కాల్పుల సమయంలో అక్కడ ప్రమాదవశాత్తు ఉన్న ఒక సాధారణ పౌరుడికి కూడా గాయాలైనట్లు సమాచారం. ఈ ఘటన సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్ లోపలే ఉన్నప్పటికీ, భద్రతా సిబ్బంది అప్రమత్తత కారణంగా ఆయనకు ఎలాంటి హానీ జరగలేదని, ఆయన పూర్తిగా సురక్షితంగా ఉన్నారని వైట్ హౌస్ అధికారులు తెలిపారు. కాల్పులు జరిగిన వెంటనే అధికారులు అప్రమత్తమై వైట్ హౌస్ పరిసరాలను కాసేపు సంక్షిప్తంగా లాక్‌డౌన్ చేశారు, ఆపై పరిస్థితి అదుపులోకి రావడంతో దానిని ఎత్తివేశారు. ప్రస్తుతం ఈ దాడి వెనుక ఉన్న ఉద్దేశాలపై ఎఫ్‌బీఐ రంగంలోకి దిగి తీవ్రంగా దర్యాప్తు చేస్తోంది.



# పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాలు



**ఆంధ్రనాడు, మే 23, 2026 :** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో తిరుపతి అర్బన్ లోని పిహెచ్సీల పరిధిలో గల సచివాలయాల్లో పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాలు విరివిగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం తిరుపతి ప్రకాశం రోడ్ సచివాలయ పరిధిలోని పల్లి వీధిలో నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై డాక్టర్లు చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ ప్రొఫెసర్ మరియు పింక్ బస్ ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ అంజు డి ఆదె మార్గదర్శకత్వంలో నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భవాని, డాక్టర్ శివసంతోష్ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకాశం రోడ్ అర్బన్ పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ క్రాంతి కుమార్, పింక్ బస్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, డాక్టర్ లావణ్య, ఏఎన్ఎంలు సుగుణ, కాంతమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న యువకుడు



**చంద్రగిరి – ఆంధ్రనాడు, మే 23:** బావిలో దూకి ఆత్మహత్య చేసుకుని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చంద్రగిరి పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇలా వున్నాయి. చంద్రగిరి పట్టణం దిగువ వీధికి చెందిన దివంగత ధనుంజయ రాజు, మునికుమారిల కుమారుడు ఆకాష్ (19)చంద్రగిరి సమీపంలో పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ రైతు పొలం లోని బావిలో దూకి మృతి చెందాడు. శుక్రవారం రాత్రి ఆకాష్ తన నడుముకి రాయి కట్టుకుని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు స్నేహితులకు ఫోటోలు పంపాడు. ఈ విషయం స్నేహితులు కువైట్ లో వున్న తల్లి మునీకుమారికి ఫోన్ ద్వారా తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు తెలిపింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకోగా, బావి గట్టు వద్ద ఆకాష్ చెప్పులు కనిపించాయి. రాత్రి ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో, శనివారం ఉదయం 6 గంటల నుండి ఫైర్ సిబ్బంది రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఫైర్ సిబ్బంది బావిలో నుంచి ఆకాష్ మృతదేహాన్ని వెలికి తీశారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంబేద్కర్ గురుకులాల్లో కౌన్సిలింగ్ షెడ్యూల్

**- ఈ నెల 27, 30 తేదీల్లో పుత్తూరులో నిర్వహణ**

**- ధృవపత్రాలతో తల్లిదండ్రులతో హాజరుకావాలని అధికారుల సూచన**



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 23:** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాసంస్థల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ (జనరల్, ఐఐటీ/నీట్) ప్రవేశాల కోసం భారీ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయ అధికారి టి. పద్మజ తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు పుత్తూరులోని అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి బాలురు, బాలికల కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. అలాగే ఇంటర్మీడియట్ ప్రవేశాల కౌన్సిలింగ్ ఈ నెల 30న అదే వేదికలో జరగనున్నదని, ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు మాత్రమే కౌన్సిలింగ్‌కు అర్హులని స్పష్టం చేశారు. ఇప్పటికే మొదటి, రెండవ జాబితాల్లో సీట్లు పొందిన విద్యార్థులు మళ్లీ హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎంపిక కాని విద్యార్థులు, అలాగే స్లైడింగ్ ఆప్షన్ ఎంచుకున్న అభ్యర్థులు మాత్రమే కౌన్సిలింగ్‌లో పాల్గొనవచ్చుని పేర్కొన్నారు. మెరిట్, రిజర్వేషన్, ఖాళీల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని వివరించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి అవసరమైన ధృవపత్రాలతో తప్పనిసరిగా కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని జిల్లా సమన్వయ అధికారి టి. పద్మజ సూచించారు.

# మామిడి కోతలో తొందరపాటు వద్దు

**- పూర్తిగా పక్వానికి వచ్చిన కాయలనే కోయాలి**

**- మామిడి రైతులకు కలెక్టర్ సూచన**



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 23:** జిల్లాలో మామిడి పంట పరిస్థితులపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఉద్యాన శాఖ అధికారులతో శుక్రవారం వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రస్తుత మామిడి దిగుబడి పరిస్థితులు, తోతాపురి మామిడి మార్కెట్ ధరలతో పాటు బెనిషా, ఖాదర్ వంటి టేబుల్ రకాల ధరలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఎలాంటి తొందరపాటు పడకుండా పూర్తిగా పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోయాలని సూచించారు. పంటను సరైన దశలో కోత చేయడం వల్ల నాణ్యత పెరుగుతుందని, మార్కెట్‌లో మంచి ధరలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే మామిడి కోతను ఒకేసారి కాకుండా దఫాల వారీగా పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోత చేపట్టాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా మార్కెట్‌లో సరఫరా సమతుల్యం కొనసాగి ధరలు స్థిరంగా ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. మే 25వ తేదీ తర్వాత జిల్లాలోని అన్ని గుజ్జు పరిశ్రమలు ప్రారంభమవుతాయని, రైతులు తమ పంటను ప్రాసెసింగ్ యూనిట్లకు సరైన విధంగా సరఫరా చేసుకునేలా అధికారులు సమన్వయం చేయాలని ఆదేశించారు. ప్రాసెసింగ్ యూనిట్లను ఉద్యాన శాఖ అధికారులు నిరంతరం సందర్శిస్తూ రైతులకు న్యాయమైన ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులకు దఫాల వారీ కోత విధానం గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని కూడా అధికారులను ఆదేశించారు. ఒకేసారి కోతలు చేపట్టడం వల్ల మార్కెట్‌లో ధరలు పడిపోవచ్చని, దశలవారీగా కోత చేయడం ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# 'ట్రెక్కింగ్ బాలు'కు రాష్ట్ర జీవవైవిధ్య పురస్కారం

**- శేషాచలం అడవుల సంరక్షణలో 35 ఏళ్ల విశేష సేవలకు గుర్తింపు**

**- అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా అధికారిక ప్రకటన**

**- గుంటూరులో అవార్డు ప్రదానం కార్యక్రమం**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 23:** పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణలో విశేష కృషి చేసిన తిరుపతికి చెందిన ప్రముఖ పర్యావరణ ప్రేమికుడు, అన్వేషకుడు, అడ్వెంచర్ కార్యక్రమాల నిర్వాహకుడు బండారు బాలసుబ్రహ్మణ్యం (ప్రజాదరణ పొందిన పేరు 'ట్రెక్కింగ్ బాలు')కు ప్రతిష్టాత్మక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య పురస్కారం – 2026 (వ్యక్తిగత విభాగం) లభించింది. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి ఈ అవార్డును అధికారికంగా ప్రకటించింది. శేషాచలం అటవీ శ్రేణులు, తిరుమల కొండల పరిసర ప్రాంతాల్లో జీవవైవిధ్యాన్ని కాపాడటంలో ఆయన చేసిన దీర్ఘకాల సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని అందించినట్లు అధికారులు తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా ఆయన శేషాచలం అడవుల జీవవైవిధ్యాన్ని డాక్యుమెంట్ చేయడం, అరుదైన వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా అరుదైన 'గోల్డెన్ గెక్కో' గుర్తింపు, ప్రాచీన రాక్ ఆర్ట్ అన్వేషణ, అలాగే యువతలో పర్యావరణ స్పృహ పెంపొందించేందుకు 155 వారాల పాటు కొనసాగించిన సండే సన్‌రైజ్ ట్రెక్కింగ్ కార్యక్రమం ఆయన సేవలకు ఉదాహరణగా నిలిచాయి. అటవీ శాఖతో పాటు స్థానిక యానాది తెగలతో సమన్వయంగా పనిచేస్తూ ఆయన చేసిన కృషిని ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రశంసించింది. ఈ సందర్భంగా ట్రెక్కింగ్ బాలు మాట్లాడుతూ, తన 35 ఏళ్ల ప్రకృతి ప్రయాణాన్ని గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. ఈ అవార్డును అటవీ సిబ్బందికి, ట్రెక్కర్లకు అంకితం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొజాయిక్ అడ్వెంచర్ కమ్యూన్ (మాక్) సెక్రటరీగా ఆయన పర్యావరణ అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని స్థానిక పర్యావరణ వేత్తలు అభినందించారు. గత ఏడాది ఇదే జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా ఆయన సోదరుడు బి.వి. రమణకు గ్రీన్ జర్నలిస్ట్ పురస్కారం లభించడం విశేషం.

# ఐక్య ఉద్యమాలతో ఫాసిస్ట్ శక్తుల కట్టడి

**- కమ్యూనిజం లేని భారత్ లేదు**

**- అభ్యుదయ రచనలతో ప్రజల్లో చైతన్యం**

**- మూఢత్వం లేని సమాజం అరసం లక్ష్యం**

**- అరసం మహాసభల్లో వక్తలు**



ప్రగతిశీల శక్తులు, వామపక్ష వాదులు తమ ఎజెండాలను పక్కనపెట్టి ఐక్య ఉద్యమాలు నిర్మిస్తేనే దేశంలో ఫాసిస్ట్ శక్తులను కట్టడి చేయవచ్చునని ప్రజాస్వామ్య రచయితల వేదిక జాతీయ సమన్వయకర్త ఆచార్య కాత్యాయని విద్మహే పేర్కొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర 23వ మహాసభలు తిరుపతిలో శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్ లో ఉదయం అరసం జెండాను రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి సంజీవమ్మ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభలో డాక్టర్ కాత్యాయని విద్మహే మాట్లాడుతూ ఫాసిజానికి వ్యతిరేకంగా కమ్యూనిజం ను సుస్థిర పరచేందుకు అరసం ఏర్పడింది అన్నారు. నాటి నుండి రచయితలు చేసిన అనేక రచనలు సమాజం లో చైతన్యం తీసుకు వచ్చాయని అన్నారు. నేడు ప్రగతి శీల శక్తులు అనైక్యంగా ఉన్నాయని, ఫాసిస్టు శక్తులు మాత్రమే ఐక్యంగా ఉన్నాయని తెలిపారు . ఈ ధోరణి దేశానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రగతి శీల శక్తులకు ఎవరి ఎజెండాలు వారికి ఉన్నా, ఐక్య కార్యాచరణను బలంగా ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. మార్క్సిస్టు దృక్పథంతో పని చేస్తున్న వారు అసమానతలు లేని, మూఢత్వం లేని సమాజం కోసం కలిసి పోరాటం సాగించాలి అని చెప్పారు. నేడు మతం సమాజాన్ని నడిపించే దారుణ పరిస్థితి దాపురించిందని విమర్శించారు. అభ్యుదయ ఉద్యమాల్లో అస్తిత్వం ఉండడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, ఐక్య వామపక్ష ఉద్యమాలు బలపడితే దేశాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. ప్రశ్నించే వారిపై అర్బన్ నక్సలైట్లు అని ముద్ర వేసి, కేసులు పెట్టడాన్ని విమర్శించారు. అదే రాముడిని కొలిచే వాడిని దేశ భక్తుడిగా కీర్తిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో లౌకిక, ప్రజాస్వామ్య, వామ పక్ష వాదులు ఏక తాటి పైకి వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయమైన భారతదేశం ఏర్పడుతుందని సంఘసంస్కరణ ఉద్యమం నిరూపించిందని అన్నారు. విచ్చలవిడి తనంతో అసమానతలు పెరిగి , దోపిడి దారులు ఎక్కువ అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రజాస్వామ్యం అని, అధికారం లోకి వచ్చాక తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మరచి లేనివి ముందుకు తీసుకొస్తారని, నిర్లిప్తంగా ఉండకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. దేశాన్ని కాపాడేందుకు ప్రగతి శీల శక్తులు ఐక్య కార్యాచరణ తో ముందుకు వెళ్లాలని అన్నారు. అరసం తెలంగాణ నాయకులు వేల్పుల నారాయణ మాట్లాడుతూ అస్తిత్వ ఉద్యమాల సంఖ్య పెరుగుతోందని, కులాల పరంగా, మతాల పరంగా రచయితల సాహితీ సంఘాలు ఏర్పడుతుండటం ప్రమాదకరంగా మారుతోందని అన్నారు. మతాల పరంగా రచనలు చేసి సోషల్ మీడియాలో రెచ్చ గొడుతున్నారని విమర్శించారు. విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలకు హాజరై అన్ని కార్మిక సంఘాల నాయకులు కార్మిక ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పిలునిచ్చారని గుర్తు చేశారు. నేడు అరసం మహాసభల్లో కూడా రచయితల ఐక్యత అనివార్యం అని తీర్మానాలు చేయడం శుభ పరిణామం అన్నారు. సమాజం ఏమౌతుందో అన్న ఆవేదన ప్రతిఒక్కరి లో ఉంది అని పేర్కొంటూ, అరసం నాయకత్వం వహించి అభ్యుదయ భావజాలం తో రచనలు చేస్తున్న అందరినీ ఒక గొడుగు కిందకు తీసుకొని రావాలి అని కోరారు. విద్యార్థులు, యువత లో చైతన్యం తీసుకొచ్చేందుకు అరసం చేసే కృషికి విశాలాంధ్ర సహకారం అందిస్తుందని తెలిపారు. విరసం రాష్ట్ర బాధ్యులు బాబ్జీ మాట్లాడుతూ అనేక నిర్బంధాలు, ఆటుపోట్లను ఎదుర్కొని రచనలు చేయడం అంత సులభం కాదని అన్నారు. కాలానికి మరింత పదును పెట్టాల్సిన నేపథ్యం నేడు దేశం లో నెలకొందని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు నేటి పాలకులు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మతాన్ని ప్రజల పై రుద్దుతోన్న పరిస్థితులను ప్రజల్లోకి తీసుకెళ్లే రచయితలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. అరసం కు విరసం తరపున సహకారం ఉంటుందని పేర్కొన్నారు. అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ తొమ్మిది దశాబ్దాలుగా అరసం ఆధ్వర్యం లో అనేక రచనలు చేసి సమాజం లో చైతన్యం తీసుకొచ్చేందుకు రచయితలు కృషి చేశారని అన్నారు. అరసం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు సాకం నాగరాజు స్వాగత ఉపన్యాసం చేస్తూ వామ పక్ష భావజాలానికి కాలం చెల్లింది అనే వారికి తగిన సమాధానం చెప్పాలని అన్నారు. కమ్యునిజం లేని భారత దేశం లేదని పేర్కొన్నారు. ఈ మహాసభలు అభ్యుదయ రచనలకు మరింత ఊతం ఇవ్వనున్నట్లు తెలిపారు. అరసం ప్రత్యేక సంచికగా తీసుకొచ్చిన విశాలాక్షి మాస పత్రికను సాకం నాగరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వేదిక పైకి అతిథులకు గంటా మోహన్ స్వాగతం పలికారు. వల్లూరి శివకుమార్ గత మహాసభల నుండి ఈ మహాసభల వరకు మృతి చెందిన రచయితలకు వల్లూరి శివ ప్రసాద్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ మహాసభల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు చిన్నం పెంచలయ్య, నాగరాజు, చారులత, గుర్రప్ప లు ఆలపించిన ఉద్యమ గేయాలు అక్కట్టుకున్నాయి.



## గ్రామ సేవా సమితి సంస్థ ద్వారా వితరణ



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 23 :** మండలంలోని శివాడిలోని బస్ స్టాండ్‌లో వున్న సుగుటూరు గంగమ్మ ఆలయం ఆవరణలో తరచుగా గ్రామానికి చెందిన పంచాయతీలు జరుగుతుంటాయి. ఎక్కువగా వృద్ధులు అక్కడే సేదతీరుతుంటారు. ప్రస్తుతం సూపర్ ఎల్నినో" ప్రభావం వలన తీవ్ర ఎండ వేడిమి వలన వృద్ధులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆ పరిస్థితిని గమనించిన గ్రామ సేవా సమితి అధ్యక్షుడు వి.రామమూర్తి శనివారం ఒక గోడ ఫ్యాన్ ను సంస్థ తరపున వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు, వృద్ధులు సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. గ్రామానికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ముందుంటామని సంస్థ అధ్యక్షుడు వి.రామమూర్తి భరోసా ఇచ్చారు.

## ప్రతిభావంతులకు పద్మ పురస్కార అవకాశం

**- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం**

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 23:** భారత ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా 2027 జనవరి 26న ప్రకటించనున్న పద్మ అవార్డులు–2026 కోసం అర్హులైన ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ తిరుపతి ముఖ్య కార్యనిర్వహణ అధికారి డా. పి. యశ్వంత్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి, ప్రత్యేక సేవలు అందించిన వ్యక్తులు ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా సామాజిక సేవ రంగంలో అత్యుత్తమ సేవలు అందించిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు రాష్ట్రీయ పురస్కార పోర్టల్ ద్వారా (అవార్డు పోర్టల్) https://awards.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ముందుగా పేర్లు నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందని (పద్మ అవార్డ్స్ పోర్టల్) https://www.padmaawards.gov.in ద్వారా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా ఆసక్తి గల అభ్యర్థులు సెట్విన్ కార్యాలయం, అలిపిరి రోడ్డు, తిరుపతి నుండి దరఖాస్తు నమూనా పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలతో ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం సెట్విన్ కార్యాలయాన్ని లేదా మొబైల్ నెం. 9440663204 ను సంప్రదించవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

## కుప్పం మునిసిపాలిటీని 32 వార్డుల పునర్విభజనకు ఆమోదం..



**కుప్పం – ఆంధ్రనాడు, మే 23:** కుప్పం మునిసిపాలిటీ పరిధిలో వార్డుల సంఖ్యను 32కు పెంచే ప్రతిపాదనకు మున్సిపల్ కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా ఎక్స్ అఫీషియో మెంబర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. వార్డుల పునర్విభజనతో స్థానిక సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని, ప్రజాప్రతినిధులు ప్రజలకు మరింత చేరువవుతారని పేర్కొన్నారు. అనంతరం వైకాపా కౌన్సిలర్లు స్పందిస్తూ.. పురపాలికకు ఆదాయాన్ని పెంచేందుకు పురపాలికకు సమీపంలోని శెట్టిపల్లె, నలగంపల్లె, పెద్దబంగారునత్తం గ్రామ పంచాయతీలను కలపాలన్నారు. కొత్త ప్రాంతాలను పురపాలికలో చేర్చడం ద్వారా ఆదాయం పెరిగి, ప్రాంతం అభివృద్ధి జరుగుతుందన్నారు. 25 వార్డులను 32 వార్డులగా పునర్విభజన చేయడం పట్ల వైకాపా కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి తుది ఆమోదం వచ్చిన తరువాత కొత్త వార్డుల అమలు ప్రక్రియ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ పి.ఎస్ మునిరత్నం, పీకెఎం ఉడా ఛైర్మన్ సురేష్ బాబు, పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు జిమ్ దాము, సోము, సురేష్, రాజ్ కుమార్, మాదవి, మమత, నాగరాజ్, మునిరాజ్ తదితరులు ఉన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం



**కార్వేటినగరం – ఆంధ్ర నాడు, మే 23 :** కార్వేటి నగరం లోని రాస్ వృద్ధాశ్రమంలో మండల తాహసిల్దార్ నాగరాజు అరుణ దంపతుల రెండవ కుమారుడు నాగశౌర్య రెండవ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి పండ్లు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు జగదీష్, సూపర్వైజర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రికి చెడ్డపేరు తెస్తే సహించేది లేదు

- పరిసరాల పరిశుభ్రత పాటించి... పేషెంట్లకు నిరంతరాయంగా నీళ్లు అందుబాటులో ఉంచాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై వేటు తప్పదు
- మెరుగైన సేవలందించి ఆసుపత్రికి మంచి పేరు తేవాలి
- ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 23:** పలమనేరు ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చెడ్డ పేరు తీసుకొస్తే సహించేది లేదని స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సూచించారు. ఆసుపత్రిలో సేవలు సరిగా లేవంటూ ఓ మహిళ సోషియల్ మీడియాలో పెట్టిన పోస్ట్ పై ఆయన వెంటనే స్పందించారు. దీంతో శనివారం ఎమ్మెల్యే ఏరియా ఆసుపత్రిని సందర్శించి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రి పరిసరాలతో పాటు అన్ని వార్డులను, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పలు కీలక సూచనలు చేశారు. ఆసుపత్రికి చెడ్డ పేరు తీసుకువచ్చే విధంగా ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అక్కడి అధికారులు,సిబ్బందికి ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఆసుపత్రి పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, రోగులకు నిరంతరాయంగా తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పేషెంట్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రోగులతో మర్యాదగా మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే, అవసరమైన పరికరాలు, వస్తువులు, సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. అయితే వైద్య సిబ్బంది సేవాభావంతో పనిచేస్తేనే ప్రజల్లో ఆసుపత్రిపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు ప్రతి ఉద్యోగి సమన్వయంతో



పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు, సుధాకర్ లతో పాటు రమేష్, నదీం, సుదర్శన్ బాలాజీ తదితరులు ఉన్నారు.

# ప్రముఖ సామాజిక కార్యకర్త మురుగన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రధానం

**పలమనేరు, ఆంధ్రనాడు, మే 23:** సామాజిక సేవా రంగంలో మరియు భక్తి ఆధ్యాత్మిక రంగంలో విశేష సేవలు అందిస్తున్న పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు బీసీ కాలనీ గంగమ్మ గుడి చైర్మన్, సేవారత్న డాక్టర్ ఆర్. మురుగన్ని పురస్కారాలు వరించాయి. పాండిచ్చేరిలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవా రంగాల్లో ఆయన చేసిన అద్భుతమైన కృషిని గుర్తిస్తూ.. అమెరికన్ విస్డం పీస్ అకాడమీ వారి తరపున ప్రతిష్ఠాత్మక "బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్" మరియు గౌరవ డాక్టరేట్ అందజేశారు. దీనితో పాటు, ఆసియా ఇంటర్నేషనల్



కల్చర్ రీసర్చ్ అకాడమీ తరపున ప్రతిష్ఠాత్మక "ఇంటర్నేషనల్ అచీవ్ మెంట్ అవార్డు" ను కూడా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్. మురుగన్ మాట్లాడుతూ..."సమాజ సేవలో మరియు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో నేను చేస్తున్న సేవలను గుర్తించి ఈ గౌరవ డాక్టరేట్, అవార్డులను అందు కోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పురస్కారాలు నాపై బాధ్యతను మరింతగా పెంచాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాను," అని ఆయన స్పష్టం చేశారు. అవార్డులు మరియు గౌరవ డాక్టరేట్ సాధించిన డాక్టర్ ఆర్. మురుగన్‌కి గంటావూరు బీసీ కాలనీ ప్రజలు, గంగమ్మ గుడి కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు మరియు స్నేహితులు పెద్ద ఎత్తున అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో సెన్సస్ పై సమీక్షా సమావేశం

**పలమనేరు – ఆంధ్రనాడు, మే 23 :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 'సెన్సస్–2027' (జనగణన) కార్యక్రమంలో భాగంగా పలమనేరు పురపాలక సంఘ కార్యాలయం నందు పురపాలక సంఘ పరిధిలోని ఎన్యూమరేటర్లు మరియు సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమీషనర్ రమణా రెడ్డి మాట్లాడుతూ... దేశ భవిష్యత్తు ప్రణాళికలకు జనగణన అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఈ సర్వేలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన పరిధిలోని ప్రతి ఒక్క ఇంటిని క్షేత్రస్థాయిలో కుణ్ణంగా పరిశీలించి సర్వే నిర్వహించాలి. ఏ ఒక్క ఇల్లూ కూడా సర్వేలో విస్మరణకు గురికాకూడదు. ప్రజల యొక్క వివరాల నమోదు, గణన అత్యంత పారదర్శకంగా జరగాలి. తప్పుడు సమాచారానికి ఎక్కడా తావుండకూడదన్నారు. ఎటువంటి చిన్న తప్పులకు ఆస్కారం లేకుండా, అత్యంత నాణ్యతతో కూడిన నివేదికలను సిద్ధం చేయాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి పలమనేరు పురపాలక పరిధిలో 'సెన్సస్–2027'ను వంద శాతం విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, అసిస్టెంట్ ఇంజనీర్ లు స్నేహ ప్రియ, శిరీష , మెప్మా సిఎమ్ఎమ్ బాబా, పురపాలక సంఘ సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



# వార్డుల పునర్విభజనపై శ్రీనగర్ కాలనీ వాసుల అభ్యంతరం

**- కమిషనర్‌కు వినతిపత్రం**

**పలమనేరు, ఆంధ్రనాడు,మే 23:** పలమనేరు మున్సిపాలిటీని 36 వార్డులుగా పునర్విభజన చేస్తూ విడుదల చేసిన ముసాయిదాపై స్థానిక శ్రీనగర్ కాలనీ నివాసితులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల (ఆర్ఓసీ నే. 40/జి 1/2026 ప్రకారం విడుదలైన ఈ ముసాయిదాలో తమ ప్రాంతాలను వేరే వార్డులో కలపడంపై శనివారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రస్తుతం ప్రకటించిన ముసాయిదాలో పాత శ్రీనగర్, శ్రీనగర్ కాలనీ పరిధిలోని కొన్ని ఇళ్లను గుడియాత్తం రోడ్డుకు అవతలి వైపు ఉన్న పాతపేట జెండామఠం వార్డులో కలిపారన్నారు. ప్రధాన



రహదారికి ఇవతలి వైపు ఉన్న ఇళ్లను, రోడ్డుకు అవతలి వైపు ఉన్న ప్రాంతంతో ముడిపెట్టడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 2019లో జరిగిన వార్డుల పునర్విభజన సమయంలో కూడా తమ ప్రాంతాన్ని ఇదే విధంగా జెండామఠంలో కలపడం వల్ల, గత ఐదేళ్లలో తమ కాలనీ అభివృద్ధి పరంగా తీవ్ర అన్యాయానికి గురైందని బాధితులు గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ అదే తప్పును పునరావృతం చేస్తూ ముసాయిదా సిద్ధం చేయడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు."శ్రీనగర్ కాలనీ ప్రాంతాలన్నింటినీ విడదీయకుండా ఒకే వార్డుగా పరిగణించాలి. అలా అయితేనే ఈ ప్రాంత ప్రజలంతా కలిసికట్టుగా, పరస్పర సహకారంతో వార్డు అభివృద్ధికి తోడ్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి అధికారులు స్పందించి, ప్రస్తుతం ప్రతిపాదించిన 20 మరియు 25 వార్డుల ముసాయిదాను పునఃసమీక్షించాలన్నారు. ముసాయిదాపై తాము వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిశీలించి శ్రీనగర్ కాలనీ ప్రాంతాన్ని ఒకే వార్డుగా ఉంచేలా సవరణలు చేయాలని కమిషనర్ రమణారెడ్డిని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిష్ రమేష్ నాయుడు, రామూర్తి నాయుడు, కృష్ణ మేస్త్రి, చెన్నారాయప్ప తదితరులు ఉన్నారు.

# సీఎంకు ఘన స్వాగతం

ఆంధ్రనాడు – చిత్తూరు / యాదమర్రి, మే 23: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పూతలపట్టు నియోజకవర్గం ఒక్కరోజు పర్యటనలో భాగంగా శనివారం పూతలపట్టుకు చేరుకున్నారు. పూతలపట్టు నియోజకవర్గం ముఖ్యమంత్రి కి స్థానిక నేతలు అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు ఎం. రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ డి. ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యేలు కే. మురళీమోహన్, గాలి భాను ప్రకాష్, గురజాల జగన్ మోహన్, ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాసులు, పులిపర్తి నాని ఎస్పి తుషార్ డూడి, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు దంపతులు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ షణ్ముఖ రెడ్డి తదితరులు ఉన్నారు.



## విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి వీడ్కోలు



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 23:** రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు అధికార యంత్రాంగం , ప్రజాప్రతినిధులు శనివారం రాత్రి వీడ్కోలు పలికారు. ఒక్క రోజు చిత్తూరు జిల్లా పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు పయనమైన ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు. ఇందులో భాగంగా శనివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు పయనమైన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకి సాదర వీడ్కోలు పలికారు.జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, శ్రీకాళహస్తి ఆర్ డి ఓ బానుప్రకాష్ రెడ్డి తదితర అధికారులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

## గ్యాస్ ట్యాంకర్‌లో డ్రైవర్ మృతి



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 23:** నాగలాపురం మండలం కారణి సమీపంలోని ఓ డాబాలో పార్కింగ్ చేసిన గ్యాస్ ట్యాంకర్‌లో డ్రైవర్ మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. అనంతపురం నుండి గుమ్మడిపూడి వైపు వెళ్తున్న గ్యాస్ ట్యాంకర్ లారీని డ్రైవర్ శుక్రవారం రాత్రి కారణి వద్ద ఉన్న డాబాలో పార్కింగ్ చేసి వాహనంలోనే నిద్రపోయాడు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో డ్రైవర్ ఎంత లేపినా స్పందించకపోవడంతో డాబా నిర్వాహకులు నాగలాపురం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే 108 అంబులెన్స్ సిబ్బందిని పిలిపించారు. అంబులెన్స్ సిబ్బంది పరిశీలించగా డ్రైవర్ మద్యం సేవించలేదని, నిద్రలోనే మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. లారీలో ఉన్న డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా మృతుడిని తమిళనాడు రాష్ట్రం నామకల్‌కు చెందిన శరవణన్ (53)గా గుర్తించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించినట్లు, వారు వచ్చిన అనంతరం మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సబ్ ఇన్స్పెక్టర్ సునీల్ తెలిపారు.

## విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 23:** నాగలాపురం మండలంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం గ్రామాలలో స్పష్టంగా కనిపిస్తున్నది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాలలో ప్రజలకు, రైతులకు విద్యుత్ పరంగా ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని వారంలో రెండు రోజులు ప్రతి మంగళవారం, శుక్రవారం కరెంటోళ్ల జనబాట కార్యక్రమం నిర్వహించేటట్టుగా ఆదేశాలను జారీ చేశారు. అదేవిధంగా ప్రతి నెల రెండవ శనివారం విద్యుత్ లైన్లు మరమ్మత్తుల కోసం ప్రజలకు విద్యుత్ అంతరాయం కలిగించేవారు. కానీ వారంలో రెండు రోజులు, నెలలో ఒకరోజు అసిస్టెంట్ లైన్ మాన్‌లో సక్రమంగా వారి విధులు నిర్వహిస్తే ఇలాంటి దృశ్యాలు ప్రజలకు కనుచూపుమేరకు కనబడవు. మరి ఈ దృశ్యాలను చూస్తే వి ద్యుత్ శాఖ అధికారులు ఏ విధంగా విధులు నిర్వహిస్తున్నారో అర్థమవుతున్నది అం టున్న ప్రజలు. ఈ దృశ్యం ఓ గ్రామంలో నీరు మోటర్ కనెక్షన్, ఈ మోటార్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోవ డం, విద్యుత్ స్తంభానికి విద్యుత్ లైన్ ల కన్నా పిచ్చి మొక్క లు వేపుగా పెరిగి విద్యుత్ లైన్ లకు అల్లుకున్న దృ శ్యం కనిపిస్తున్నది. ఈ ప్రదేశంలో ఆర్అండ్బి ప్రధాన రహదారి రోడ్డు మార్గం, మూగజీవాలు సంచరించే ప్రదేశం, ఇప్ప టికే ఈ గ్రామంలో విద్యుత్ శాఖ అధి కారుల నిర్లక్ష్యం వల్ల రెండు ప్రాణాలను కోల్పో వడం జరిగింది. మరిన్ని ప్రాణాలు కోల్పోతే ఈ విద్యుత్ శాఖ అధికారుల స్పందిస్తా రో? ఇదేనా విద్యుత్ శాఖ అధి కారులు పనితీరు అని గ్రామస్తులు హేళన చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మండల విద్యుత్ శాఖ, ఉప విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్, పుత్తూరు డివిజనల్ విద్యుత్ శాఖ, జిల్లా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ని ర్లక్ష్యం చేస్తున్న అసిస్టెంట్ విద్యుత్ లైన్ మాన్ పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రైల్వే పెన్షనర్ కు 10 వేలు వితరణ



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 23 :** రేణిగుంట క్యారేజీ రిపేరు వర్క్ షాప్ పెన్షనర్ చెల్లయ్య రెడ్డికి రేణిగుంట స్వర్ణామృత సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల డాక్టర్ టి. సురేంద్ర 10 వేల రూపాయలు సహాయం అందజేశారు. రైల్వే పెన్షనర్ల సదస్సులో భాగంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఏఐఆర్ఆర్ఎఫ్ జాతీయ నాయకుడు శ్రీధర్ చేతుల మీదుగా డాక్టర్ సురేంద్ర, ఓ ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న రైల్వే పెన్షనర్ చెల్లయ్య రెడ్డి కి మెరుగైన వైద్య సేవల నిమిత్తం, అందజేయాలని పదివేల రూపాయల చెక్కును వితరణ చేశారు. దీంతో సి ఆర్ ఎస్ రైల్వే పెన్షనర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎం విజయ్ కుమార్, చైర్మన్ దాస్ కమిటీ సభ్యులు డాక్టర్ సురేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ వికలాంగులైన రైల్వే పెన్షన్లకు తన వంతు సహాయ సహకారంలో భాగంగా దంత వైద్య సేవలు అందిస్తానని డాక్టర్ హామీ ఇచ్చారు.

## ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో ప్రజలు భాగ స్వాములు కావాలి: ఎమ్మెల్యే ఆరణి




**తిరుపతి, ఆంధ్రనాడు, మే 23:** తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా నిలపడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. శనివారం నారాయణపురం వద్ద ఉన్న చేపల మార్కెట్ వద్ద ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తోపాటు డిప్యూటీ కమిషనర్ అమరయ్య, గ్రీనరి అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర తదితరులు పాల్గొని ప్రారంభించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి పరిసరాలను శుభ్రపరిచారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ జూన్ 22వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాల్టీలు, కార్పోరేషన్స్ లో జరుగుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నాలుగు వారాలు పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఒక్కో వారం ఒక్కో అంశంతో నగరాన్ని శుభ్రపరచడమే ఆపరేషన్ క్లీన్ స్వీప్ లక్ష్యమని ఆయన చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భాగస్వాములు కావాలని ఆయన కోరారు. స్వచ్ఛసర్వేక్షణ్ లో భాగంగా పరిసరాల పరిశుభ్రతకు ప్రధానమంత్రి నరేంద్ర మోది ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన చెప్పారు. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ప్రతి మూడవ శనివారం పరిశుభ్ర నగరాలు, పంచాయితీల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపి దేవికుమారి, డి.ఈ. లు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మార్పు కనిపించేలా పరిశుభ్రత కార్యక్రమాలు - కమిషనర్ పి నరసింహప్రసాద్



**చిత్తూరు, మే 23, ఆంధ్రనాడు :** అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో స్పష్టమైన మార్పు కనిపించేలా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలని కమిషనర్ పి నరసింహ ప్రసాద్ చెప్పారు. “ఆపరేషన్ క్లీన్ స్వీప్” కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం నగరపాలక సంస్థ పరిధిలో పలమనేరు రోడ్డు జానకారపల్లి వద్ద జరిగిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్, ఎంహెచ్వో డా. లోకేష్ లు పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వ్యర్థాలతో నిండిన ప్రాంతాన్ని స్వయంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని అన్ని వార్డుల్లో పకడ్బందీగా చేపట్టాలన్నారు. నిర్దేశించిన నాలుగు వారాల కార్యక్రమాలను పూర్తిస్థాయిలో చేపట్టాలని అధికారులను, స్వర్ణ వార్డు కార్యదర్శులను ఆదేశించారు. శనివారం ఉదయం నగరపాలక సంస్థ పరిధిలో అన్ని వార్డుల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, ఎన్జీవోలతో కలిసి శుభ్రం చేశారు. అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు, స్థానిక పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## దివ్యకాంతులతో ప్రకాశిస్తున్న శ్రీ గోవింద రాజస్వామి బ్రహ్మోత్సవాలు

**-భక్తి కాంతులతో కళకళలాడుతున్న తిరుపతి మాడవీధులు**
**-విద్యుత్ కాంతుల్లో దర్శనమిస్తున్న శ్రీమహావిష్ణు అవతారాలు**





**తిరుపతి, ఆంధ్రనాడు, మే 23:** తిరుపతిలోని శ్రీ గోవింద రాజ స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 23 నుండి 31వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో ఆలయ పరిసరాలను దివ్య విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శ్రీహరి దశావతార మహిమను ప్రతిబింబించే ఈ ప్రత్యేక అలంకర ణలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతూ బ్రహ్మోత్సవాల వైభవాన్ని మరింత రెట్టింపు చేస్తున్నాయి.శ్రీ అనంతపద్మనాభ స్వామి, శ్రీ మహావిష్ణువు దశావతార రూపాలను కళాత్మక విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు. మత్స్యావతారం, కూర్మావతారం, వరాహస్వామి, నరసింహా వతారం, వామనావతారం, పరశురామా వతారం, బలరామావతారం, హనుమాన్ రూపాలు దర్శనమిచ్చేలా రూపొందించిన విద్యుత్ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రైల్వే స్టేషన్ సమీపంలో వామనావతారం, రాయలచెరువు గేట్ జంక్షన్ వద్ద బలరామావతారం, బేరీవీధిలో పరశురాముడు, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమంతుని దివ్య రూపాలు ఆధ్యాత్మిక కాంతులను వెదజల్లు తున్నాయి.అదేవిధంగా శ్రీరామావతారం, శ్రీకృష్ణావతారం, కల్కి అవతారం రూపాలు భక్తులకు భగవద్భక్తిని మరింతగా చాటుతున్నాయి. నాలుగు మాడవీధుల్లో విద్యుత్ ఆర్చ్‌లు, ఫ్లడ్‌లైట్లు, శోభాయమాన తోరణాలు, బాంబ్ స్టిక్స్, నడకదారుల వెంట ప్రత్యేక విద్యుత్ పందిళ్లు ఏర్పాటు చేశారు. వాహనసేవలను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ దివ్య విద్యుత్ అలంకరణలు తిరుపతిని వైకుంఠనగరిని తలపించేలా తీర్చిదిద్దారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతిని అందించేలా టిటిడి ఎలక్ట్రికల్ శాఖ అధికారులు, సిబ్బంది విద్యుత్ అలంకరణలు చేపట్టారు.

## వేసవిలో ఆరోగ్య సమస్యలను నిర్లక్షం చేయకుండా, సరైన జాగ్రత్తలు

**- ఆరోగ్యానికి మించిన సంపద లేదు ఆరోగ్యమే మహాభాగ్యం:**
**బోత్ హాస్పిటల్స్ ఛైర్మెన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్**



**తిరుపతి, ఆంధ్రనాడు, మే 23:** నిత్యం దైనందిక జీవితంలో ఎన్నో ఒడుదులుకులను ఎదుర్కోనీ జీవనం సాగిస్తున్న సామాన్య, మధ్య తరగతి, పేద ప్రజలు తమ ఆరోగ్య విషయాన్ని గురించి తెలుసుకోవాలని ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదని ఆరోగ్యమే మహాభాగ్యం అని జనసేన పార్టీ రాష్ట్ర వ్యవహారాల కమిటీ సభ్యులు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఆంధ్ర ప్రదేశ్ హస్తకళల నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మెన్, బోత్ హాస్పిటల్స్ ఛైర్మెన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో పలు రకాల ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దాహం, డీహైడ్రేషన్, వడదెబ్బ, జీర్ణ సమస్యలు, చర్మ వ్యాధులు వంటి సమస్యలు వేడికి సంబంధించిన ప్రతికూల ప్రభావాలుగా కనిపిస్తాయి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ సూచించారు.

**డీహైడ్రేషన్, వడదెబ్బ**

అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోతుంది, దాంతో శరీరానికి అవసర మైన ఎలక్ట్రోలైట్స్ లోపించి అలసట, తలనొప్పి, వడదెబ్బ వచ్చే అవకాశం ఉంటుంది. ఎండలో ఎక్కువసేపు ఉన్నప్పుడే కాకుండా, తగినంత నీరు తాగకపోయినా డీహైడ్రేషన్ సమస్య ఏర్పడుతుంది అని అన్నారు

**ఆస్తమా ఊపిరితిత్తుల సమస్యలు**

వేసవిలో గాలి పొల్యూషన్ ఎక్కువగా ఉండడం వల్ల ఆస్తమా మరియు శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా ప్రభావితం అవుతాయి. ధూళి, పొగ, పొల్యూషన్ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఉండటాన్ని నివారించాలి. ఆస్తమా ఉన్నవారు తమ వెంట ఇన్హేలర్ మరియు మెడిసిన్స్ తప్పనిసరిగా ఉంచుకోవాలి.

**చర్మ సమస్యలు, అలర్జీలు**

చెమట అధికంగా కారడం వల్ల చర్మం మురికితో ముడిపడి ఫంగల్ ఇన్ఫెక్షన్లు, రాషెస్ ఏర్పడతాయి.శోభి మచ్చలు (తినియా వెర్సికలర్) వేసవిలో అధికంగా ప్రబలతాయి. యూవీ రేడియేషన్ కారణంగా చర్మం కమిలిపోవడం, సన్‌బర్న్, మచ్చలు ఏర్పడే ప్రమాదం ఉందని డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు

**విరేచనాలు, కలరా**

వేసవిలో భోజనం త్వరగా పాడవడం, నీటి కాలుష్యం పెరగడం వల్ల విరేచనాలు, కలరా వంటి సమస్యలు వస్తాయి. రహదారి పక్కన ఉన్న ఆహారం, కలుషితమైన నీరు తాగడం వల్ల బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశముంది

**మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, కిడ్నీ సమస్యలు**

వేసవిలో నీటి తగ్గుదల వల్ల మూత్రంలో మలినాలు పేరుకుని యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు (యూటీ ఐ ) సోకే అవకాశం ఉంటుంది. తగినంత నీరు తాగకపోతే కిడ్నీ రాళ్లు ఏర్పడే అవకాశం కూడా ఎక్కువ అని అన్నారు

**వేసవి జాగ్రత్తలు నివారణ చర్యలు**

రోజూ కనీసం 3–4 లీటర్ల నీరు తాగాలి. ఒకసారి ఉడికించిన లేదా ఫిల్టర్ చేసిన నీరు తాగాలి. పొడిగా, వేడిగా ఉండే ఆహారాన్ని తగ్గించి, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి. పొల్యూషన్ ఎక్కువగా ఉన్న ప్రదేశాలకు వెళ్లినప్పుడు మాస్క్ ధరించడం ఉత్తమం. పొడిపోతే ఊపిరితిత్తుల సమస్యలున్న వారు వైద్యుల సూచనల ప్రకారం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎక్కువ నీరు తాగాలి, ఎక్కువ ఉప్పు ఉన్న ఆహారాన్ని తగ్గించాలి. ఎండలో ఎక్కువసేపు ఉండడం వల్ల సన్‌బర్న్, డీహైడ్రేషన్ సమస్యలు వస్తాయి, కాబట్టి సన్‌స్క్రీన్ వాడడం, హాట్ టైమ్‌లో బయటికి వెళ్లకుండా ఉండటం మంచిది. హైడ్రేటింగ్ ఫుడ్స్ (కాకర, దోసకాయ, ముజ్జిగ, కొబ్బరి నీరు) తినడం వల్ల వేడి తగ్గుతుంది. వేసవిలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వేసవిలో ఆరోగ్య సమస్యలను నిర్లక్షం చేయకుండా సరైన జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని జనసేన పార్టీ రాష్ట్ర వ్యవహారాల కమిటీ సభ్యులు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఆంధ్ర ప్రదేశ్ హస్తకళల నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మెన్, బోత్ హాస్పిటల్స్ ఛైర్మెన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు.

## తాగునీటి సమస్యకు చెక్ - కొత్త బోరు ప్రారంభం




**కురబలకోట – ఆంధ్రనాడు, మే 23:** తంబళ్లపల్లి నియోజకవర్గం కురబలకోట మండలం నందిరెడ్డిగారి పల్లి పంచాయతీ పరిధిలో గ్రామ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన కొత్త తాగునీటి బోరును శుక్రవారం స్థానిక నాయకులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కురబలకోట మండల కన్వీనర్ వైజి సూరి, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు పూసా మోహన్ రెడ్డి, తెలు గుదేశం పార్టీ నాయకులు నార్లపల్లి శివారెడ్డి, తెలుగు యువత నాయకులు అయూబ్ భాష, శ్రీనాథ్ రెడ్డి తదిత రులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మౌలిక వస తుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని నాయకులు తెలి పారు. తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని ఈ బోరును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లోకేశ్వర్ రెడ్డి, భాస్కర, అరవిందర్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, క్రిష్ణ రెడ్డి, ఉత్తమ రెడ్డి, ఆనంద రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కుమార రెడ్డి, చంద్ర తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు నాయుడుకి స్వాగతం పలికిన ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి



**పలమనేరు – ఆంధ్రనాడు, మే 23:** చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కంద్రిగ గ్రామానికి శనివారం చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పార్టీ శ్రేణుల నుండి ఘన స్వాగతం లభించింది. గ్రామానికి చేరుకున్న ము ఖ్యమంత్రికి మాజీ మంత్రి, పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పుష్ప గుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి ఆత్మీయ స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కంద్రిగలో సందడి వాతావరణం నెలకొంది. సీఎంకు జిల్లాకు చెందిన పలువురు శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్–ఛార్జిలు కీలక నేతలు ముఖ్యమంత్రికి హెలిపాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేశారు. జిల్లా స్థాయి, నియోజకవర్గ, మండల స్థాయి తెలుగుదేశం పార్టీ నేతలు, ఉమ్మడి జిల్లాల కూటమి ఎం ఎల్ ఎ లు, నాయకులు భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలి వచ్చారు. ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకుని యాదమరి మండల వ్యాప్తంగా రాష్ట్ర జిల్లా పోలీసులు గట్టి భద్రతా చర్యలు పాటించారు.

## చిత్తూరుకు అదనపు నిధులను కేటాయించండి



**చిత్తూరు, మే23, ఆంధ్రనాడు:** పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండల పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సభా వేదిక వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రధాన సమస్యలపై వినతి పత్రం అందించారు. చిత్తూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్లుప్తంగా వివరించారు. మరికొన్ని పనులకు అదనపు నిధులు కేటాయించాలని కోరారు.

# గంటావూరు జాతరకు పాండిచ్చేరి సీఎం రంగస్వామికి ఆహ్వానం




**పలమనేరు – ఆంధ్రనాడు, మే 23 :** పలమనేరు మున్సిపల్ పరిధిలోని గంటావూరులో ఈ నెల 25 నుంచి 27 వరకు అంగరంగ వైభవంగా జరగనున్న గంగమ్మ జాతరకు విచ్చేయాలని పాండిచ్చేరి సీఎం రంగస్వామిని దేవస్థాన కమిటీ ఛైర్మన్, సేవరత్న డాక్టర్ మురుగన్ శనివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాండిచ్చేరి సీఎం క్యాంపు కార్యాలయంలో కలసి సన్మానించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 25న అమ్మవారి శిరస్సు మెరవణి, 26 న అమ్మవారి విశ్వరూప దర్శనం, 27న జలధి కార్యక్రమాలు ఉంటాయని జాతరకు తప్పక విచ్చేయాలని సిఎం ను కోరారు.

## జనసేన కార్యకర్తను పరామర్శించిన నాయకులు



**కురబలకోట – ఆంధ్రనాడు, మే 23:** జనసేన పార్టీ సీనియర్ కార్యకర్త కురబలకోట మండలం తట్టివారిపల్లికి చెందిన కె. వెంకటరమణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం అయన తిరుపతి రమాదేవి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వెంకటరమణను జనసేన తంబళ్లపల్లె నియోజకవర్గ ఇంచార్జ్ పోతుల సాయినాథ్ పరామర్శించారు. శనివారం సాయినాథ్ తిరుపతిలోని రమాదేవి ఆసుపత్రికి వెళ్లి వెంకటరమణకు అందుతున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితి తదితర విషయాలు తెలుసుకొన్నారు. ఆయనతో పాటు ఆ పార్టీ నాయకులు రామచంద్ర తదితరులు ఉన్నారు.

## పసుపులేటి హరిప్రసాద్‌ను కలిసిన జనసైనికులు




కురబలకోట – ఆంధ్రనాడు, మే 23: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల కార్పోరేషన్ బోర్డు ఛైర్మన్, జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, సీనియర్ నేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌ను కురబలకోట మండల జనసైనికులు మర్యాద పూర్వకంగా కలిశారు. డాక్టర్ హరిప్రసాద్‌ను కలిసిన వారిలో ఆ పార్టీ తంబళ్లపల్లె నియోజకవర్గం ఇంచార్జి పోతుల సాయినాథ్ తోపాటు కురబలకోట మండల నాయకులు కుంచి రామచంద్ర, అనిల్, బండి వినోద్, భరత్, శివశంకర్, బీజేపీ రాజారెడ్డి ఉన్నారు. జనసేనలో క్రియాశీలకంగా ఉన్న డాక్టర్ హరిప్రసాద్‌ను కలిసి బొక్కే, శాలువాతో సత్కరించారు. ఈ సందర్బంగా తంబళ్లపల్లి నియోజకవర్గ సమస్యల గురించి ఆయనకు వివరిస్తూ, అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేసినట్లు జనసేన నాయకుడు రామచంద్ర తెలిపారు.

# కుక్కల దాడిలో దుప్పి మృతి



**రామకుప్పం – ఆంధ్రనాడు, మే 23:** రామకుప్పం మండలం బంధార్లపల్లి వద్ద అడవి నుంచి దారితప్పి పంట పొలాల్లోకి వచ్చిన దుప్పిని ఊరి కుక్కలు చంపి వేసాయి దానితో రామకుప్పం అటవీ శాఖ ఓ అధికారులకు సమాచారం తెలిసింది పశువైద్యాధికారిని జై శ్రీ దుప్పికి పోస్టుమార్టం నిర్వహించారు అటవీశాఖ అధికారులు దానిని అడవిలో పూడ్చివేశారు

# మిట్టపల్లి చెరువు అభివృద్ధి పనులకు భూమి పూజ



**రామకుప్పం – ఆంధ్రనాడు, మే 23:** రామకుప్పం మండలం మిట్టపల్లి పెద్ద చెరువు అభివృద్ధి కోసం సుమారు యాభై లక్షల రూపాయలు నిధులు మంజూరు అయినది దీనికోసం భూమి పూజ శనివారం శాసనమండలి చీఫ్ విప్ కంచర్ల శ్రీకాంత్ ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం కెపిఎం యూడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు చేశారు దాంతో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జల వనరులు వృధా పోకుండా చేయుటకు చెరువులు అభివృద్ధి చేస్తున్నాడని పేర్కొన్నారు దాంతో పాటు హంద్రీనీవా కాలువల ద్వారా నీళ్లు వచ్చేందుకు మిగిలిన చెరువులకు సప్లై ఛానల్ ద్వారా నీరు సరఫరా చేస్తామని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రామకుప్పం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ టిటిడి పాలక మండలి సభ్యులు శాంతారామ్, టిడిపి ప్రధాన కార్యదర్శి కామ రాజు నాయక్, మాజీ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి ఎంపీపీ సులోచన గుర్రప్ప రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్ తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ సింగిల్ విండో అధ్యక్షుడు మహమ్మద్ రఫీ కుప్పం మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు సీతాపతి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి టిడిపి నాయకులు మంజునాథ రెడ్డి రామకృష్ణప్ప మంజునాథ్ క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి ఇంకా టిడిపి నాయకులు పద్మమ్మ రాణమ్మ ఇంకా పలువురు పాల్గొన్నారు.

# అమ్మవారి సేవలో తుడా ఛైర్మన్, మాజీ మంత్రి

**తిరుచానూరు – ఆంధ్రనాడు, మే 23:** తిరుమల శ్రీవారి దేవేరి, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని తుడా చై ర్మన్, టీటీడీ ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి, టీ డీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావులు కుటుంబ సమేతంగా శనివారం దర్శిం చుకున్నారు. ఆలయం వద్ద వారికి ఆలయ సూపరింటెం డెంట్లు సురేష్, ముని చెంగల్రాయలు, ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం ధ్వ జస్తంభానికి మొక్కులు తీర్చుకొని, వేద పండితులతో వేద ఆశీర్వచనం స్వీకరించారు. అమ్మవారి కుంకుమార్చన సే వలో పాల్గొన్న వారికి ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో

# గుర్తుతెలియని మృతదేహం లభ్యం

- శెట్టిపల్లి రైల్వే గేటు సమీపంలో ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**తిరుచానూరు – ఆంధ్రనాడు, మే 23:**


తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన శనివారం తిరుపతి – రేణిగుంట రహదారిలోని శెట్టిపల్లి రైల్వే గేటు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు కొత్తగా నిర్మించిన గోడకు ఆనుకుని గుర్తుతెలియని వ్యక్తి శవం కనిపించగా, వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న తిరుచానూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్



కుమార్ నేతృత్వంలోని పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ప్రాథమిక వివరాలు నమోదు చేశారు. పోలీసుల ప్రాథమిక అంచనాల ప్రకారం మృతుడు వయస్సు సుమారు 35 నుండి 45 సంవత్సరాల మధ్య ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి తల వెంట్రుకలు నలుపు రంగులో ఉండగా, ఒంటిపై మాచో కంపెనీకి చెందిన నీలం, నలుపు రంగు డ్రాయర్ మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. దామినేడు గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి గుర్తింపు, అలాగే మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. మృతుడి గురించి ఏవైనా సమాచారం తెలిసిన వారు తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో తెలియజేయాలని, లేదా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్ – 9440796755, ఎస్ఐ టి.వి. సుధాకర్– 9491074536, ఎస్ఐ ఎ. సిద్ధారెడ్డి – 9182358025 నంబర్లను సంప్రదించాలని సీఐ సునీల్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# స్వచ్ ఆంధ్ర, స్వచ్ మిషన్ మరియు స్వచ్ సర్వేన్షన్‌లో భాగంగా

## పుంగనూరు మున్సిపాలిటీ ఆకస్మికంగా తనిఖీ చేసిన సబ్-క లెక్టర్ పుంగనూరు మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ చల్లా కళ్యాణి






**పుంగనూరు – ఆంధ్రనాడు, మే 23:** పుంగనూరు మున్సిపల్ పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ్ మిషన్ మరియు స్వచ్ సర్వెన్షన్‌లో భాగంగా పుంగనూరు మున్సిపల్ కార్యాలయం మరియు అన్న క్యాంటీన్ లను జిల్లా సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి ఆకస్మిక తనిఖీలు చేశారు స్వచ్ఛభారత్ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్, లో మున్సిపల్ సిబ్బందితో పాటు రోడ్డు ఊడ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆర్ఆర్ కళ్యాణ మండపం వద్ద రాయల చెరువు డ్రైవ్ కామెల్ పరిశీలించారు, తర్వాత అన్న క్యాంటీన్ లో ప్రజల తోపాటు ఉదయం టిఫిన్ చేసి అన్న కాంటీన్ ఆవరణలో చెట్లు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమం పుంగనూరు మునిసిపల్ కమీషనర్ మధుసూదన్ రెడ్డి పరివేక్షణలో జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బందితోపాటు పట్టణ అభివృద్ధి కమిటీ తెలుగుదేశం పార్టీ నాయకులు, సివిరెడ్డి, రామకృష్ణం రాజు, క్లస్టర్ ఇన్చార్జి నాగరాజా, మరియు సచివాలయ సిబ్బంది వెంకటేష్, రెడ్డెమ్మ, డ్వాక్రా సంఘాల ఆర్పీలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ఆర్సీబీపై సన్‌రైజర్స్ ఘనవిజయం.. అయినా తప్పని ఎలిమినేటర్!

## ఆర్సీబీపై 55 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ గెలుపు

## తొలుత బ్యాటింగ్ చేసి 255 పరుగుల భారీ స్కోరు చేసిన హైదరాబాద్

ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, క్లాసెన్ అర్ధ సెంచరీలు గెలిచినప్పటికీ మూడో స్థానంతో సరిపెట్టుకున్న రైజర్స్ ఈ నెల 27న ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనున్న సన్‌రైజర్స్ ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించింది. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో 55 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. అయితే, ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరుకోవాలన్న సన్‌రైజర్స్ ఆశ నెరవేరలేదు. సమీకరణాల కారణంగా మూడో స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.



ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు సాధించారు. ఇషాన్ కిషన్ (46 బంతుల్లో 79), అభిషేక్ శర్మ (22 బంతుల్లో 56), హెన్రిచ్ క్లాసెన్ (24 బంతుల్లో 51) అర్ధ సెంచరీలతో చెలరేగారు. చివరిలో నితీశ్ కుమార్ రెడ్డి (12 బంతుల్లో 29 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ (19 బంతుల్లో 44; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) అద్భుతమైన ఆరంభాన్నిచ్చాడు. ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 4.3 ఓవర్లకే జట్టు స్కోరును 60 పరుగులకు చేర్చాడు. అయితే, ఇషాన్ మలింగ బౌలింగ్‌లో అతను ఔటవ్వడంతో ఆర్సీబీ పరుగుల వేగానికి కళ్లెం పడింది. ఆ తర్వాత కొద్దిసేపటికే విరాట్ కోహ్లీ (15), దేవదత్ పడిక్కల్ (21) కూడా పెవిలియన్ చేరడంతో బెంగళూరు కష్టాల్లో పడింది.

ఈ దశలో కెప్టెన్ రజత్ పటీదార్ (39 బంతుల్లో 56; 6 ఫోర్లు, 1 సిక్సర్) ఒంటరి పోరాటం చేశాడు. కృనాల్ పాండ్యతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేసినా, అవసరమైన రన్‌రేట్ భారీగా పెరిగిపోవడంతో ఒత్తిడి పెరిగింది. పటీదార్ అర్ధశతకం పూర్తి చేసుకున్న తర్వాత ఔటయ్యాడు. చివరిలో కృనాల్ పాండ్య (41 నాటౌట్), టిమ్ డేవిడ్ (15 నాటౌట్) ప్రయత్నించినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సన్‌రైజర్స్ బౌలర్లలో మలింగ రెండు వికెట్లతో రాణించగా, సాకిబ్ హుస్సేన్, ట్రావిస్ హెడ్ చెరో వికెట్ పడగొట్టారు.

ఈ విజయంతో సన్‌రైజర్స్ 14 మ్యాచ్‌లలో 9 విజయాలతో లీగ్ దశను ముగించింది. అయితే, మూడో స్థానంలో నిలవడంతో ఈ నెల 27న ముల్లన్ పూర్ లో ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో ఓడితే టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. గెలిస్తే ఫైనల్ బెర్త్ కోసం క్వాలిఫయర్ 2లో తలపడుతుంది. అటు, ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ కూడా 14 మ్యాచ్ లలో 9 విజయాలు నమోదు చేశాయి. అయితే, మెరుగైన రన్ రేట్ కారణంగా ఆర్సీబీ తొలి స్థానంలో, గుజరాత్ రెండో స్థానంలో ఉన్నాయి. మూడు బెర్తులు స్టాండింగ్స్ తో సహా ఖరారైన నేపథ్యంలో, నాలుగో బెర్తు కోసం రాజస్థాన్, పంజాబ్, కోల్ కతా, ఢిల్లీ జట్ల మధ్య పోటీ నెలకొంది.

అటు, ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ కూడా 14 మ్యాచ్ లలో 9 విజయాలు నమోదు చేశాయి. అయితే, మెరుగైన రన్ రేట్ కారణంగా ఆర్సీబీ తొలి స్థానంలో, గుజరాత్ రెండో స్థానంలో ఉన్నాయి. సన్ రైజర్స్ మూడో స్థానానికి పరిమితమైంది. ఈ మూడు జట్లు 18 పాయింట్లతో ఉన్నాయి. మూడు బెర్తులు స్టాండింగ్స్ తో సహా ఖరారైన నేపథ్యంలో, నాలుగో బెర్తు కోసం రాజస్థాన్, పంజాబ్, కోల్ కతా, ఢిల్లీ జట్ల మధ్య పోటీ నెలకొంది. నాలుగో స్థానంలో నిలిచిన జట్టుతో సన్ రైజర్స్ ఎలిమినేటర్ మ్యాచ్ లో తలపడనుంది.



## ఐపిఎల్ కు విజయ్ శంకర్ గుడ్ బై

చెన్నై: టీమిండియా క్రికెటర్ విజయ్ శంకర్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్)తో పాటు దేశవాళీ క్రికెట్‌కు గుడ్ బై చెబుతున్నట్టు ప్రకటించాడు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించాడు. 'ఐపిఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా... కొత్త అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకు, మరింత క్రికెట్ ఆడేందుకు ఈ రెండింటికి రిటైర్మెంట్ ప్రకటిస్తున్నా.. బిసిసిఐ, సహకరించిన ప్రతి ఒక్క ఆటగానికి ధన్యవాదాలు. ఎన్నో విషయాలు నేర్చుకోవడం, లెక్కలేనన్ని జ్ఞాపకాలు పోగేసుకోడవడంతో పాటు దేశం తరఫున ఆడడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నా. 2019 వన్డే ప్రపంచకప్‌లో చివరి ఓవర్ వేసి తొలి బంతికే వికెట్ తీయడం జీవితాంతం గుర్తు పెట్టుకుంటా. నా కెరీర్లలో నేను విద్వేషాన్ని, ప్రతికూల పరిస్థితులను చవిచూశాను. అయితే.. వాటిని నేను పట్టించుకోకుండా ముందుకు సాగాను. నేను అలా చేయగలిగినప్పుడు ఎవరికైనా సాధ్యమే. పాజిటివ్‌గా ఆలోచించండి. బాగా కష్టపడండి. క్రికెట్టే నా జీవితం' అని భావోద్వేగంతో కూడిన పోస్ట్ పెట్టాడు.

### 2013లో అరంగేట్రం

తమిళనాడుకు చెందిన విజయ్ 2012లో రాష్ట్ర జట్టు తరఫున అరంగేట్రం చేశాడు. పదమూడేళ్లు సొంత జట్టుకు ఆడిన విజయ్ శంకర్.. 2025-26 సీజన్‌లో త్రిపురకు మారాడు. 2013లో చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడిగా ఐపిఎల్ అరంగేట్రం చేసి 2017లో సన్‌రైజర్స్‌కు.. 2018లో ఢిల్లీ క్యాపిటల్స్ జెర్సీతో.. ఆపై మూడేళ్లు మళ్లీ సన్‌రైజర్స్ తరఫున బరిలోకి దిగాడు. 2022లో గుజరాత్ టైటాన్స్ అరంగేట్రంలోనే ఛాంపియన్‌గా నిలవడంలో విజయ్ కీలక పాత్ర పోషించాడు. టీమిండియా ఆటగాడిగా 2018-19 మధ్య కాలంలో 12 వన్డేలు, తొమ్మిది టీ20లు ఆడాడంతే. 2025లో చెన్నై గూటికి చేరిన విజయ్ ను 2026 ఐపిఎల్ మినీ వేలంలో ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు.

# లీగ్ చిన్నదైనా.. ఛాన్స్ పెద్దదే!

చిత్ర పరిశ్రమలో కాంబినేషన్లు అనేవి ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి. ముఖ్యంగా సీనియర్ స్టార్ హీరోల సరసన నటించే కథానాయికల ఎంపిక విషయంలో దర్శకులు సరికొత్త ప్రయోగాలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే విక్టరీ వెంకటేష్ నటిస్తోన్న -ఆదర్శ కుటుంబం హౌస్ నెంబర్ 47- చిత్రంలో హీరోయిన్ల ఎంపిక అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. ఈ సినిమాలో సీనియర్ స్టార్ వెంకీకి జోడీగా -కేజీఎఫ్- ఫేమ్ శ్రీనిధి శెట్టిని ఎంపిక చేయడం, తాజాగా తాజాగా గ్లామరస్ బ్యూటీ నివేదా పేతురాజ్‌ను మరో నాయికగా తీసుకుంటున్నారు? అనేది హాట్ టాపిక్‌గా మారింది. బాక్సాఫీస్ వద్ద ఇండస్ట్రీ హిట్లు కొట్టిన రికార్డు ఉన్నా? శ్రీనిధి శెట్టి టాలీవుడ్‌లో ఇంకా స్టార్ లీగ్‌లోకి పూర్తి స్థాయిలో చేరలేదు. అలాగే నివేదా పేతురాజ్ కూడా వరుసగా మంచి సినిమాలు చేస్తున్నా? టాప్ లీగ్ స్టార్ హీరోయిన్‌గా స్థిరపడటానికి భారీ





సినిమా అంటే ఒక వర్గానికి మాత్రమే కాకుండా ఫ్యామిలీ ఆడియన్స్ అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. అలాంటి పెద్ద కాన్వాస్ ఉన్న సినిమాలో ప్రధాన నాయికలుగా కనిపించే అవకాశం రావడం తో ఇద్దరి కెరీర్‌కు మైల్‌స్టోన్‌గా నిలిచిపోనుంది. ఆ రకంగా చూస్తే ఈ భామలిద్దరూ చాలా లక్కీ. సాధారణంగా సీనియర్ హీరోల సినిమాల్లో కథానాయికల పాత్రల ప్రాధాన్యత, వారి కెమిస్ట్రీపై ప్రేక్షకులు ప్రత్యేక నిఘా ఉంచుతారు. వెంకటేష్ సరసన వీళ్లిద్దరు ఎలా? సెట్

కమర్షియల్ సక్సెస్ కోసం ఎదురు చూస్తోంది. ఇలాంటి తరుణంలో స్టార్ హీరోయిన్ల రేసులో ఉన్న ఇద్దరు భామలకు కాకుండా వీరిద్దరికీ సీనియర్ స్టార్ - క్రేజీ దర్శకుడి ప్రాజెక్ట్‌లో చోటు దక్కడం ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఇద్దరు భామలు ఇప్పటివరకు స్టార్ లీగ్‌లో పూర్తి స్థాయిలో అడుగు పెట్టకపోయినా? విక్టరీ వెంకటేష్ లాంటి సీనియర్ స్టార్‌తో స్క్రీన్ స్పేస్ పంచుకునే అవకాశం రావడం పెద్ద విషయమనే చెప్పాలి. వెంకటేష్

అవుతారు అనే సందేహాలు కొందరిలో ఉన్నా? దర్శకుడి విజన్ , మేకింగ్ శైలిపై పరిశ్రమకు పూర్తి నమ్మకం ఉంది. నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలతో పాటు, కథను మలుపు తిప్పే బలమైన క్యారెక్టరైజేషన్లు ఉండటంతో ప్రాజెక్ట్ లోకి తీసుకున్నట్లు సమా చారం.

ఈ క్రేజీ ఛాన్స్ ఇద్దరికీ తమ నటనలోని సరికొత్త కోణాన్ని ఆవిష్కరించడానికి అద్భుతమైన వేదిక కానుంది. ఈ సినిమా గనుక ఆశించిన విజయాన్ని సాధిస్తే శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్‌ల మార్కెట్ వాల్యూ మరింత పెరుగుతుంది. మిగిలిని సీనియర్ హీరోలకు మంచి ఆప్షన్ అవుతారు.

# స్పెషల్ మాస్ సాంగ్ 'హల్లల్ల ల్లో'



రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన గ్లింప్స్, రెండు చార్ట్ బస్టర్ పాటలు, పవర్ ఫుల్ థియేట్రికల్ ట్రైలర్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, శుక్రవారం చిత్ర బృందం మూడవ సింగిల్ 'హల్లల్ల ల్లో' ప్రోమోను విడుదల చేసింది. ఈ పాటలో రామ్ చరణ్ తన రగ్డ్, స్టైలిష్ లుక్‌లో అదిరిపోయే స్టెప్పులతో ఆకట్టుకుంటున్నారు. ఆయనతో పాటు శ్రుతి హాసన్, జాన్వీ కపూర్ కూడా అలరించారు. శ్రుతి హాసన్ తన బోల్డ్ అటిట్యూడ్‌తో, జాన్వీ కపూర్ తన గ్రేస్‌ఫుల్ ఎనర్జీతో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముగ్గురి స్క్రీన్ ప్రెజెన్స్ కలిసి ఈ పాటను మరింత గ్రాండ్‌గా మార్చింది. పూర్తి పాటను నేడు (శనివారం) భోపాల్‌లో జరగనున్న భారీ మ్యూజికల్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ వేడుకలో ఏఆర్ రెహమాన్, ఆయన బృందం ఈ పాటను ప్రత్యక్షంగా ప్రదర్శించనుండటంతో అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. జూన్ 4న ఈ సినిమా విడుదల కానుండగా, జూన్ 3న ప్రత్యేక ప్రీమియర్‌లు ప్రదర్శించనున్నారు.

## 29న మరీచిక విడుదల



డైరెక్టర్ సతీష్ కాసెట్టి తన కొత్త థ్రిల్లర్ మూవీ 'మరీచిక'తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. రెజీనా కసాండ్రా, అనుపమ పరమేశ్వరన్, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 29న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, మేఘా చిలక నిర్మిస్తున్నారు. కార్తీక్, శ్వేతా మోహన్ ఆలపించిన పాటను ఇటీవల చిత్ర యూనిట్ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. లక్ష్మీ భూపాల సాహిత్యాన్ని అందించారు. ఇళయరాజా సంగీతం అందించారు. ఈ పాటలో ముగ్గురు మధ్య ఉన్న స్నేహం, ప్రేమ, భావోద్వేగ క్షణాలను ఎంతో అందంగా చూపించినట్టు చిత్ర యూనిట్ తెలిపింది.

ANDHRANADU
TELUGU DAILY

ఆదివారం
24.05.2026

తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

# సంజీవని ద్వారా ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందిస్తాం

- హార్టికల్చర్ రంగంలో రాయలసీమను ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దుతాశీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డు సృష్టిస్తున్నాం
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్
- సంజీవని గ్రామీణ ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించే వ్యవస్థ
- పూతలపట్టు ఎమ్మెల్యే మురళి
- సంజీవని ద్వారా ప్రజలకు ఆధునిక ఆరోగ్య భద్రత ఎంపీ దుగ్గిమళ్ల ప్రసాదరావు

**చిత్తూరు, యాదమరి – ఆంధ్రనాడు, మే 23:** సంజీవని ద్వారా ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలను అందించడమే లక్ష్యం అని గౌ.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శనివారం చిత్తూరు జిల్లా యాదమరి మండలం కంద్రిగ గ్రామంలో నిర్వహించిన సంజీవని కార్యక్రమంలో గౌ. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా ఇంచార్జ్ మంత్రి రాంప్రసాద్, ఎం పి దుగ్గిమల్ల ప్రసాద్ రావు, పూతలపట్టు ఎం.ఎల్.ఏ మురళి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, టాటా సంస్థ సి.ఈ.ఓ గిరీష్ కృష్ణ మూర్తి లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వర్యులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం విధానంలో సంజీవని కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు.

గత ఏడాది కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన సంజీవని కార్యక్రమాన్ని ప్రస్తుతం చిత్తూరు జిల్లాకు విస్తరించామని, రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15లోపు పూర్తి స్థాయిలో అమలు చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి వ్యక్తికి డిజిటల్ హెల్త్ రికార్డు రూపొందించబడుతుందని తెలిపారు. గ్రామ స్థాయిలోనే 42 రకాల వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆధారిత వైద్య సలహాలు, వర్చువల్ కన్సల్టేషన్, డాక్టర్ ఫాలోఅప్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి భవిష్యత్తులో ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను కూడా తీసుకువస్తామని పేర్కొన్నారు.ప్రతి పౌరుడికి రూ.2.5 లక్షల వరకు ఆరోగ్య



బీమా సదుపాయం కల్పిస్తున్నామని, అవసరమైతే చీ= వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల వరకు వైద్య సహాయం అందిస్తున్నామని తెలిపారు.మంచి ఆహారం, వ్యాయామం, యోగ, ధ్యానం, ప్రాణాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు సూచించారు. అనే భావనతో ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని కోరారు.రాష్ట్రంలో నీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, హంద్రీ--నీవా, గాలేరు--నగరి, సోమశిల--స్వర్ణముఖి లింక్ కాలువ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని తెలిపారు.రాయలసీమలో పరిశ్రమలు, డేటా సెంటర్లు, డ్రోన్ సిటీలు, ఏరోస్పేస్ హబ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. హార్టికల్చర్ రంగంలో రాయలసీమను ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.అధికారులు ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించిన ముఖ్యమంత్రి, పనితీరును డిజిటల్‌గా మానిటరింగ్ చేస్తామని తెలిపారు. వివిధ శాఖల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను సభలో అభినందించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సంజీవని కార్యక్రమం ద్వారా ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డు రూపొందిస్తున్నామని తెలిపారు. గత 18 నెలలుగా ముఖ్యమంత్రి స్వయంగా ఈ కార్యక్రమాన్ని సమీక్షిస్తూ మార్గనిర్దేశం చేస్తున్నారని చెప్పారు.సంజీవని డిజిటల్ నర్వ్ సెంటర్ కాల్ సెంటర్ ద్వారా ఇప్పటివరకు 73 వేల మందికి హెల్త్ ఫాలోఅప్ నిర్వహించామని వెల్లడించారు. ప్రతి కుటుంబానికి నిరంతర వైద్య పర్యవేక్షణ అందించేలా ఆరోగ్య శాఖతో పాటు ఇతర శాఖల సమన్వయంతో మరింత సమర్థవంతంగా కార్యక్రమాన్ని అమలు చేస్తామని తెలిపారు.

పూతలపట్టు ఎమ్మెల్యే మాట్లాడుతూ సంజీవని కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తోందన్నారు. ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలు డిజిటల్ రూపంలో భద్రపరచి, భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించే విధంగా ఈ వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు.పేద ప్రజలు వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు పడకుండా, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. హంద్రీ--నీవా ప్రాజెక్ట్ పూర్తయితే రాయలసీమ ప్రాంతం హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

ఎంపీ దుగ్గిమల్ల ప్రసాదరావు మాట్లాడుతూ సంజీవని కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు సమగ్ర ఆరోగ్య భద్రతను అందించే వినూత్న కార్యక్రమమని తెలిపారు. ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలు డిజిటలైజ్ చేసి, భవిష్యత్తులో వచ్చే అనారోగ్య సమస్యలను ఆధారంగా ముందుగానే గుర్తించే వ్యవస్థను ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు.

సంజీవని యాప్ ద్వారా అపాయింట్‌మెంట్ బుకింగ్, వైద్య సలహాలు, ఫాలోఅప్ సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. టాటా సంస్థల సహకారంతో డిజిటల్ నర్వ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.రాష్ట్ర అభివృద్ధి, ఆరోగ్యం, పారిశ్రామిక పురోగతికి ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు.

టాటా సంస్థ సీఈవో గిరీష్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విజయం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉత్తమమైన విధానాలను సాంకేతికత ద్వారా అందిపుచ్చుకొని ఆంధ్ర రాష్ట్రానికి మెరుగైన సేవలను ముఖ్యమంత్రి అందిస్తున్నారని పేర్కొన్నారు. సంజీవని కార్యక్రమం ద్వారా టాటా డిజిటల్ నర్వ్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని దీని ద్వారా మారుమూల ప్రాంతం వరకు కూడా ప్రతి వ్యక్తికి వైద్యం అందించడం సులువు అవుతుందని తెలిపారు.

# ఇరాన్ గగనతలం మూసివేత

- 8 విమానాశ్రయాల నుండే రాకపోకలు పగలు విమానాల బంద్
- తాజా దాడులపై ట్రంప్ యోచన ?
- పురోగతి లేకుండా చేతులు మారుతున్న ముసాయిదాలు
- అమెరికా అధికారి వ్యాఖ్యలు




**వాషింగ్టన్, టెహ్రాన్ – ఆంధ్రనాడు, మే 23:** పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు ఆవరిస్తున్నాయా? అంటే పరిస్థితులు, సంకేతాలు అలానే కనిపిస్తున్నాయి. అమెరికా మళ్ళీ దాడులు పునరు ద్ధరించ వచ్చునే ఆందోళనల నేపథ్యంలో పశ్చిమ ఇరాన్ గగనతలాన్ని ఇరాన్ తాత్కాలికంగా మూసేసింది. ఈ మేరకు ఇరాన్ పౌరవిమాన యాన సంస్థ ప్రకటించింది. కేవలం 8 విమానాశ్రయాలు మాత్రమే కఠినతరమైన ఆంక్షల మధ్య పనిచేస్తున్నాయి. మరోపక్క ఇరాన్, వాషింగ్టన్‌ల మధ్య ఒప్పందం కుదర్చడానికి దౌత్య యత్నాలు కొనసాగుతునే వున్నాయి. ఇదిలావుండగా, ఇరాన్‌పై తాజాగా దాడులు పునరుద్ధరించే విషయంలో అమెరికా కూడా సీరియస్‌గానే ఆలోచిస్తోందని, అమెరికా మిలటరీ ఇందుకు సమాయత్తమవుతోందని వార్తలు వెలువడుతున్నాయి. ఇరాన్ పశ్చిమ ప్రాంతంలోని విమానాశ్రయాల్లో పౌర విమానాల రాకపోకలను రద్దుచేశారని పౌర విమానయాన సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. టెహరాన్‌లోని మెహ్రాబాద్, ఇమామ్ ఖొమేనీ విమాన్రాశయాలతో సహా కేవలం 8 మాత్రమే పనిచేస్తున్నాయి. ఆ విమాన్రాశయాల్లో కూడా సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు విమానాల రాకపోకలను నియంత్రించారు. ప్రతి ఒక్క విమానానికి పౌర విమానయాన సంస్థ నుండి అనుమతి తీసుకోవాల్సి వుంటుందని ఆ ప్రకటన పేర్కొంది. ప్రాంతీయ ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్నవేళ ఇరాన్ ఈ చర్యలు తీసుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఒప్పందం తక్షణమే కుదురుతుందన్న సంకేతాలు వెలువడకపోవడంతో ఇరాన్‌పై కొత్తగా దాడులు చేసే ఆలోచనను ట్రంప్ ప్రభుత్వం చేస్తోందని శుక్రవారం యాక్సిస్, సిబిఎస్ న్యూస్ ఒక వార్తా కథనాన్ని వెలువ రించాయి. ఆదివారం వాషింగ్టన్‌లోనే వుండేలా ట్రంప్ తనషెడ్యూల్‌ను మార్చుకు న్నారని కూడా తెలిపింది. దీంతో మళ్ళీ ఘర్షణలు తప్పకపోవచ్చునే సంకేతాలు కనిపిస్తున్నాయి. కాగా సైన్యం సమాయత్తమవుతున్నా తుది నిర్ణయం ఇంకా తీసు కోలేదని సిబిఎస్ తెలిపింది. శుక్రవారం ఉదయం తన సలహాదారులతో ట్రంప్ సమావేశమయ్యారని, ఇరాన్‌కు సంబంధించిన తాజా పరిణామాలను చర్చించారని యాక్సిస్ తెలిపింది. న్యూజెర్సీలో జరిగే తన కుమారుడు ట్రంప్ జూనియర్ వివాహానికి తాను హాజరు కాకపోవచ్చని అంతకుముందు ట్రంప్ ప్రకటించారు. కొన్ని ప్రభుత్వ వ్యవహారాలు వున్నందున తాను వాషింగ్టన్‌లో వుండాల్సి వుంటుందని చెప్పారు. ఇదిలావుండగా, ఒప్పందం కుదిరేలా చూసేందుకు పాక్ దౌత్య యత్నాలు ముమ్మరమయ్యాయి. ప్రస్తుతం టెహ్రాన్‌లోనే మకాం వేసిన పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ వివిధ ప క్షాలతో మంతనాలు జరుపుతున్నారు. ఇరాన్ నిర్ణయాక క్రమంలో కీలక పాత్ర పోషించే ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్ అహ్మద్ వాహి దితో మునీర్ భేటీ అయ్యారు. పెద్దగా పురోగతి అంటూ ఏమీ లేకుండానే ప్రతి రోజూ ముసాయిదాలు అటూ ఇటూ చేతులు మారడం ఆందోళన కలిగిస్తోందంటూ ఈ పరి ణామాల గురించి తెలిసినొక అమెరికా అధికారిని ఉటంకిస్తూ యాక్సిస్ వ్యాఖ్యా నించింది. ఇరాన్ అణ్వాయుధం కలిగి వుండరాదన్నది మా అభిమతం, కాబట్టి మేం గట్టిగానే దాడి చేశాం, అంతకంటే మాకు ఇంకో అవకాశం లేదు. ఇరాన్ కూడా ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని తహతహలాడుతునే వుంది, చూద్దాం ఏం జరుగు తుందో! అంటూ శుక్రవారం వైట్‌హౌస్‌లో వ్యాఖ్యానించారు. గత కొద్ది రోజులుగా ఇరాన్‌తో చర్చల వ్యవహారం సాగదీత పట్ల ట్రంప్ చాలా అసహనంగా వున్నారని ఆయన సన్నిహిత వర్గాలు వ్యాఖ్యానించాయి.




Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733